కార్తికం.. కమనీయం


సూర్యలంక బీచ్‌లో పూజలు

ఆలయాలకు.. పోటెత్తిన భక్తులు ● వైభవంగా కార్తిక సోమవారం పూజలు

అద్దంకి, బాపట్ల రూరల్,అమరావతి, కోటప్పకొండ(నరసరావుపేట), పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తికమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తిక దీపాలు వెలిగించిన భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. శివనామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. రోజంతా కొందరు మహిళలు ఉపవాస దీక్ష చేపట్టారు. పంచారామ క్షేత్రాల్లో ప్రథమ ఆరామమైన అమరావతిలోని అమరేశ్వరాలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. తొలుత కృష్ణానదిలో స్నానమాచరించిన భక్తులు నదీతీరంలో, ఆలయ పరిసరాల్లో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం క్యూల్లో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. మేధా దక్షిణా మూర్తి స్వరూప త్రికోటేశ్వరస్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. ఆలయ ప్రాంగణం, నందీశ్వరుని విగ్రహం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. పెద కాకాని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శివయ్య దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. యజ్ఞాల బావి వద్ద స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపారాధనలు చేశారు. అనంతరం స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాకాని శివయ్యను హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్ దంపతులు, విజయవాడ డీసీపీ కెజివి సరిత, గుంటూరు ఆర్డీవో శ్రీనివాస్ దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో అమరావతి అమరేశ్వరుడు

సముద్రుడికి తాంబూలం

బాపట్లలోని సూర్యలంక సముద్రతీరం తెల్లవారుజాము నుంచే భక్తులతో సందడి నెలకొంది. తీరంలో మహిళలు, పురుషులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళా భక్తులు తీరం ఒడ్డున ఇసుకతిమ్మెలతో శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సముద్రదేవుడికి తాంబూలాన్ని సమర్పించారు.


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


బాపట్ల : సూర్యలంక తీరంలో భక్తుల స్నానాలు


గుంటూరులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వాటర్‌షెడ్ పర్యావరణానికి పునాది

- నీటి నిర్వహణతోనే దేశాభివృద్ధి
- జాతీయ సదస్సులో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- గుంటూరులో అట్టహాసంగా ప్రారంభమైన సదస్సు
- వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన అధికారులు, ఎన్‌జీవోలు
- వెంగళాయపాలెం చెరువు సందర్శనకు నేడు కేంద్ర మంత్రి చౌహాన్

నేడు వాటర్‌షెడ్ మహోత్సవ్ సభ

వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0తో గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలో అభివృద్ధి చేసిన చెరువును మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సందర్శించనున్నారు. సోమవారం రాత్రి గుంటూరుకు చేరుకున్న ఆయ న ఐటీసీ హోటల్‌లో బస చేశారు. ఆయన మంగళవారం ఉదయం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారు లతో కలిసి వెంగళాయపాలెం చెరువుని సందర్శిస్తారు. అనంతరం లయోలా పాఠశాలలో జరిగే వాటర్ షెడ్ మహోత్సవ్ సభలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం జాతీయ వాటర్ షెడ్ సదస్సు ముగింపు కార్యక్రమం ఐటీసీ హోటల్‌లో జరుగుతుంది. సాయంత్రం పెమ్మసాని నివాసంలో డిన్నర్‌కి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరౌతారు.


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, అధికారులు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ అంటే చెక్‌డ్యాం కాదని ఇది గ్రామీణ భారత పునర్నిర్మాణానికి బలమైన పర్యావరణ పునాది అని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల వాటర్‌షెడ్ జాతీయ సదస్సు గుంటూరులో ఐటీసీ వెల్‌కం హోటల్‌లో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్రం, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు, ఎన్‌జీవోలు, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ దేశాన్ని ప్రగతిపథంలో నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషికి అండగా కేంద్ర ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయాలన్నారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో వెంగళాయపాలెంలోని 21 ఎకరాల విస్తీర్ణంలోని చెరువుని కేవలం రూ.కోటి ఖర్చు చేసి 15 రోజుల్లోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ఆ చెరువుని మంగళవారం ఉదయం ప్రతినిధులంతా సందర్శించాలని కోరారు. దేశాభివృద్ధి నీటి నిర్వహణపై ఆధారపడి ఉందని, వర్షం వచ్చినప్పుడే ఆ నీటిని సేకరించి నిల్వ చేసుకుని ఆ తర్వాత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటర్ షెడ్ కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చన్నారు. తద్వారా రైతులకు పంట ఆదాయం పెరుగుతుందన్నారు. రెండో పంట సాగు చేసే అవకాశం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. వచ్చే ఏడాది ప్రారంభించబోయే వాటర్ డెవలప్‌మెంట్ కన్వర్జెన్స్ - పీకేఎస్‌వై 3.0ని ఏ విధంగా రాష్ట్రాలు (మిగతా 6వ పేజీలో)


వివిధ రాష్ట్రాల నుంచి సదస్సుకు హాజరైన అధికారులు

ఢిల్లీ ఘటనతో... రెడ్ అలర్ట్



- ఎక్కడికక్కడ అప్రమత్తమైన పోలీసులు
- హోటళ్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా రెండు గంటల పాటు నాకాబందీ




గుంటూరు: నాకాబందీలో భాగంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు


గుంటూరు: రైల్వే స్టేషన్ వద్ద డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

బాపట్ల, చీరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం బాంబు పేలుళ్ల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు రెడ్‌అలర్ట్ ప్రకటించారు. ఐజీ, ఎస్పీలతో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్త అత్యవసరంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నాకాబందీ పేరుతో విస్తృత తనిఖీలకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సోమ వారం రాత్రి 8:30 నుంచి 10:30 గంటల వరకు పోలీసులు విస్తృతంగా తనిఖీ చేపట్టారు. రోడ్లపైనా, అన్ని ప్రధాన కూడళ్లలోనూ వాహన తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లతో పాటు జన సమర్థంగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లోనూ ఆయా తనిఖీలు కొనసాగాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు ఇతర రవాణా వాహనాలను ఆపి ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించారు. ఆయా తనిఖీల్లో అనుమానాస్పద వ్యక్తులను పూర్తిస్థాయిలో విచారించి వారి ఆధారాలు పరిశీలించిన తర్వాతే వదిలేశారు. బాంబుడిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లు సైతం రంగంలో దిగి తనిఖీలు నిర్వహించాయి. మరోవైపు కౌంటర్ ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రరిస్ట్ నిఘా బృందాలు రంగంలో దిగి క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఆరాతీస్తున్నాయి.పోలీసులు అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో రంగంలోకి తనిఖీలు చేపట్టడంతో ఏం జరిగిందో అర్థం కాక వాహన చోదకులు అయోమయానికి గురయ్యారు. మరోవైపు ఆయా జిల్లాల్లో వీఐపీల కదలికలు ఉన్న ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టు దిట్టం చేశారు. ఇక జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్ల తో పాటు అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ ఆకస్మిక తనిఖీలు కొనసాగాయి. గుంటూరు శివారు వెంగళాయపాలెంలో జరగనున్న జాతీయ వాటర్ షెడ్ మహోత్సవానికి కేంద్ర మంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆయా ప్రాంతాల్లో బందోబస్తును పటిష్ఠం చేశారు.

రాజ్యలక్ష్మి కుటుంబానికి

అండగా ఎన్నారైలు

- మృతదేహం తరలింపునకు నిధుల సేకరణ



కారంచేడు(పర్చూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి(రాజీ) కుటుంబ సభ్యులకు భారత సంతతి బాసటగా నిలిచింది. ఆమె కుటుంబం ఆర్థిక సమస్యలో ఉందన్న విషయాన్ని అమెరికాలో ఉన్న ఆంధ్రా స్టూడెంట్ డైస్ గుర్తించింది. ఈ క్రమంలో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు, ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎన్నారైలు నిధులు సేకరిస్తున్నట్లు మృతురాలి బంధువు చైతన్య తెలిపారు. అంత్యక్రియల ఖర్చుతోపాటు, విద్యా రుణాలను తిరిగి చెల్లించేలా గో ఫండ్ మీ సంస్థ సాయంతో భారత కమ్యూనిటీ నిధులు సేకరిస్తున్నట్లు సమాచారం.

శింగరకొండలో 18న కోటీ దీపోత్సవం

అద్దంకి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఈ నెల 18న కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్, ఈవో తిమ్మానాయుడు తెలిపారు. దీపోత్సవంలో పాల్గొనే భక్తులు బుధవారంలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆలయ రాతి ముఖ మండపం నిర్మాణం పూర్తయిన తర్వాత మొదటి సారిగా నిర్వహిస్తున్న కోటి దీపోత్సవానికి ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పూజా సామగ్రిని దాతల సహకారంతో పంపిణీ చేస్తామన్నారు.

రూ.9.72 కోట్లతో జల్‌జీవన్

గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం


ఇంటూరులో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు

వేమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గంలోని 18 గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.9.72 కోట్లతో జల జీవన పథకం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పథకానికి సంబంధించి పలు గ్రామాల్లో నూతనంగా వాటర్ ట్యాంకులు, బోర్ల నిర్మాణంతోపాటు పైపులైన్ల ఏర్పాటు చేయనున్నారు. వీటిలో కొన్ని పనులను ప్రారంభించి శరవేగంగా కొనసాగిస్తున్నారు. మరికొన్ని పనులకు టెండర్లు పూర్తి చేశారు. ఆయా మండలాల పరిధిలో చావలి, పెరవలిపాలెం, అమృతలూరు, గోవాడ, ఇంటూరు, అద్దేపల్లి, కోనేటిపురంలో ట్యాంకుల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. పెనుమర్రులో ఉప్పునీటి సమస్య పరిష్కారానికి కొల్లూరు మండలం చినపులివర్రు నుంచి పైపులైన్ నిర్మాణం చేయనున్నారు. కోడిపర్రు, యలవర్రులో బోర్ల నిర్మాణం, కిష్కంధపాలెం, పోతార్లంక, బోడపాడు, గోపాయపాలెం, ప్యాపర్రు, భట్టిప్రోలు, ఆలపాడులో పైపులైన్లను నూతనంగా ఏర్పాటు చేయనున్నారు.

నిబంధనలు.. స్పీడ్‌బ్రేక్

- చోదకుల ప్రాణాలతో చెలగాటం

పర్చూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేగ నిరోధకాల ఏర్పాటులో నిబంధనలకు తిలోదకాలిస్తూ వాహన చోదకుల ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారు. గ్రామాలు, పట్టణాలతో పాటు జాతీయ రహదారులపై కూడా ఇష్టం వచ్చినట్లుగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణంలో ప్రమాదాలకు అవకాశం లేకుండా తగు ప్రమాణాలను పాటించాలని కేంద్ర ప్రభుత్వం పదే పదే సూచిస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు వాటిని పట్టించుకోవడంలేదు. జాతీయ రహదారి 167 ఏలో పర్చూరు వైజంక్షన్ కూడలిలోని ఫ్లైఓవర్ సమీపం పర్చూరు - గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన వేగనిరోధకాలు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ తొలిరోజే పర్చూరు నుంచి గుంటూరు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురై పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే పర్చూరు మండలం అడుసుమల్లికి చెందిన ఓ వ్యక్తి స్పీడ్ బ్రేకర్‌ను గుర్తించక ప్రమాదానికి గురై గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గడిచిన మూడు రోజుల వ్యవధిలో అనేక మంది వేగ నిరోధకాలను గుర్తించక ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ఇంతటి ప్రమాద కరంగా పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాహనదారులు వాపోతున్నారు.


ప్రమాద భరితంగా ఉన్న గుంటూరు రోడ్డులో వేగనిరోధకం

నేడు కేంద్ర బృందం పర్యటన

- కారంచేడులో దెబ్బతిన్న పంటల పరిశీలన


స్వర్ణ కాలువ వద్ద దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కారంచేడు(పర్చూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నష్టాన్ని అంచనా వేయడానికి పౌసుమి బసు నేతృత్వంలోని కేంద్ర బృందం మంగళవారం జిల్లాలో పర్యటించనుంది. ఈ బృందం తొలుత చీరాలలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తుంది. అనంతరం వేటపాలెం మండలం రామాపురం గ్రామానికి చేరుకుని రోడ్లను, కారంచేడులో ముంపు బారిన పడిన పంటలను, కొమ్మమూరు కాల్వకు పడిన గండ్లను పరిశీలించనున్నది. మధ్యాహ్నం వరకు మొత్తం మూడు గంటల పాటు జిల్లాలో ఈ బృందం నష్టాల్ని పరిశీలించనున్నది. కాగా ఈ బృందం పర్యటించే ప్రాంతాల్లో సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ పర్యటించారు. కారంచేడు మండలంలో దెబ్బతిన్న పంటలతో పాటు కొమ్మమూరు కాల్వ, కప్పలవాగు, పర్చూరు వాగులకు పడిన గండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్వర్ణ గ్రామంలో స్వర్ణ కాలువ పొంగి కొమ్మమూరు కెనాల్‌లో కలిసిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. బృందానికి నష్టాలను వివరించే క్రమంలో అధికారులు పక్కాగా వ్యవహరించాలని తెలిపారు. కేంద్ర బృందం పర్యటించే రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని తహసీల్దారు నాగరాజును ఆదేశించారు. చీరాల ఆర్డీవో, డీఏవో, డీఎస్పీ, డీఈఈ, కేడబ్ల్యూడీ ఈఈ, కారంచేడు మండల తహసీల్దార్‌తో పాటు ఇతర అధికారులకు విడివిడిగా బాధ్యతలను కలెక్టర్ అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్సీ వెంకటరత్నం, డ్రెయినేజ్ ఈఈ మురళీకృష్ణ, వ్యవసాయశాఖ అధికారి కె.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

అచ్చంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు పుష్కర ఘాట్ వద్ద ఆదివారం గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తెలంగాణలోని హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన ముజాహిద్దీన్ తన స్నేహితులతో కలసి పులిచింతల ప్రాజెక్టు సందర్శనకు వచ్చాడు. మాదిపాడులోని పుష్కర ఘాట్ వద్ద స్నానాలు చేస్తుండగా కాలు జారి నదిలో పడి గల్లంతయ్యాడు. ముజాహిద్దీన్ మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


చింతకాయల వెంకట్రావు (ఫైల్ ఫొటో)

యడ్లపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వృద్ధ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం, కొత్తపాలెం గ్రామానికి చెందిన చింతకాయల వెంకట్రావు (72) ఏటా పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తుంటాడు. పెట్టుబడుల కోసం రూ.11లక్షల వరకు అప్పు చేశాడు. ఈ ఏడాది కూడా కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసినప్పటికీ ఆశాజనకంగా లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. గత కొన్నేళ్లుగా దిగుబడులు రాక వరుస నష్టాలు వస్తుండడం.. అప్పులు తీర్చలేనేమోనన్న భయంతో తల్లడిల్లిపోయాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న కొత్తపాలెం గ్రామ శివారులో పురుగుల మందు తాగి చిన్న కుమారుడు లక్ష్మీనారాయణకు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన వెంకట్రావును గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అటు నుంచి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 8న వెంకట్రావు మృతిచెందాడు. వెంకట్రావు పెద్ద కుమారుడు గోపి సోమవారం యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సూర్యప్రకాశ్ (ఫైల్ ఫొటో)

కొల్లిపర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గాజువాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లిపర మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం గ్రామానికి చెందిన కె.సూర్యప్రకాశ్ (44) పనిమీద విశాఖపట్టణంలోని గాజువాకకు వెళ్ళాడు. ఆదివారం సూర్యప్రకాశ్ గాజువాకలో జాతీయ రహదారిపై వెళుతుండగా లారీ ఢీకొట్టింది. దాంతో సూర్యప్రకాశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని సోమవారం పోలీసులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. సూర్యప్రకాష్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. అతడికి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

కాలువలో పడి విద్యార్థిని మృతి


నరసమ్మ (ఫైల్ ఫొటో)

ఈపూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలవలోకి జారి పడి ఏడో తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటన ఈపూరు మండలంలోని ఇనుమెల్లలో సోమవారం జరిగింది. భద్రపాలెం గ్రామానికి చెందిన గండికోట సుబ్బారావు, మల్లేశ్వరి దంపతుల చిన్న కుమార్తె నరసమ్మ (12) ఇనుమెల్ల హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. సోమవారం పాఠశాల విడిచి పెట్టిన తర్వాత ఇంటికి వచ్చే క్రమంలో బస్సు కోసం మేజర్ కాలువ వద్ద దిమ్మెలపై కూర్చుంది. దాహం వేయ డంతో బాటిల్‌తో నీళ్ల తీసుకోవడానికి కాలువలోకి దిగింది. ఈ క్రమంలో కాలుజారి కాలువలో పడి గల్లంతయింది. ఆ సమయంలో అక్కడే దుస్తులు ఉతుకుతున్న ఓ మహిళ నరసమ్మను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతయిన నరసమ్మ కోసం గాలింపు చేపట్టగా కొంత దూరంలో ఆమె మృత దేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నరసమ్మ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ఐకమత్యంతోనే అద్భుత విజయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలి
- అడిగొప్పుల నేతల పనితీరు భేష్
- నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

దుర్గి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఐకమత్యంతో అద్భుత విజయం సాధించామని, అందరూ కలిసి మెలిసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం మండలంలోని ధర్మవరంలో హరిహర బాలనాగేంద్రస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఎడ్లబండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా సంతోషంగా ఎడ్లపోటీలకు హాజరవడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ఎక్కడ చూసినా పల్లెలు పశువులతో కళకళలాడేవని, పశు సంపదను ముందు తరాలకు అందించేలా ఎడ్ల పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు అనుకూలంగా ఉన్నాయని, మిర్చి, పత్తి, కంది ధరలు ఆశాజనకంగా ఉండడంలో కూటమి ప్రభుత్వం కృషి ఉందన్నారు. గతంలో ఎన్నో ప్రాజెక్టులు మూలనపడ్డాయని, వాటికి జీవం పోసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేయకుండా గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. అడిగొప్పుల గ్రామ కూటమి నేతలు గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని, వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చే స్తుందని లావు కృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, కుర్రి శివారెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, బూసా రామాంజనేయులు, జానకి రామయ్య, వజ్రం నాయక్, దిగుమర్తి సుబ్బారావు, మేకల దాసు, యాగంటి నరేశ్, తోటకూర శ్రీనివాసరావు, సింగు నాగేశ్వరరావు, జక్కా రమేశ్, వంకమళ్ల కోటేశ్వరరావు, వెలిదండి శ్రీనివాసరావు, నాగెండ్ల శ్రీను, కూటమి నేతలు పాల్గొన్నారు.

చిక్కీలో పురుగులు

- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

చుండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చుండూరు మండల ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు ఇస్తున్న చిక్కీ ప్యాకెట్లలో నుంచి పురుగులు బయటకు వస్తున్నా అధికారులు వాటిని పాఠశాలలకు పంపిణీ చేశారు. సోమవారం ఆలపాడులోని 1వ వార్డు ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న పాప పాఠశాలలో ఇచ్చిన చిక్కీని సాయంత్రం ఇంటికి తెచ్చుకొంది. చిక్కీ కవర్ చించమని తండ్రిని కోరింది. ఆయన కవర్ చించగా చిక్కీ నుంచి పురుగులు బయటకు వచ్చాయి. మండలంలోని 32 ప్రాథమిక పాఠశాలలకు ఇటీవల ఈ చిక్కీలను పంపిణీ చేశారు. విద్యార్థులు పురుగులు ఉన్న చిక్కీలను గుర్తించక వాటిని తిని ఉంటారని, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి చుండూరు మండలంలోని పాఠశాలల పనితీరును పరిశీలించి రెండు సంవత్సరాలకు పైగా అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల వ్యక్తిగత పర్యవేక్షణ కనిపించడం లేదని అందువల్లే చాలా మంది తల్లిదండ్రులు ఇంటి నుంచి పిల్లలకు క్యారేజీలు ఇచ్చి పంపుతున్నారని తెలుపుతున్నారు. నానాటికి ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మండలంలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు విడిచి ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరుతున్నారని చెబుతున్నారు. ఒక్కసారైన ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అవకతవకలపై జిల్లా విద్యాశాఖాధికారి వ్యక్తిగతంగా పరిశీలించాలని కోరుతున్నారు. పురుగుల చిక్కీలను అందించిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక మోసాల నివారణపై ఏఎన్‌యూలో సదస్సు

ఏఎన్‌యూ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలను అధిగమించడంపై మంగళవారం ఏఎన్‌యూలో ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నామని సోమవారం కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి ఆర్.శివరాం ప్రసాద్ తెలిపారు. ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్, కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఏఎన్‌యూ ఆధ్వర్యంలో సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వివిధ ఆర్థిక మోసాలు, పెట్టుబడులు, స్టాక్ మార్కెట్ పరిస్థితుల గురించి ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఏఎన్‌యూలోని బాలమోహన్ దాస్ సెమినార్ హాల్లో ఈ సదస్సు జరుగుతుందని శివరాం తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తుళ్లూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాయపూడి లాంచీ రేవు వద్ద కృష్ణానదిలో ఆదివారం గల్లంతైన ఇద్దరిలో నాగులపల్లి పవన్ (29) అనే యువకుడి మృతదేహం లభ్యమైంది. స్నానానికి దిగిన కొద్ది దూరంలో పవన్ మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లు వెలికి తీశారు. మృతుడు కోనసీమ జిల్లా అమరాపురం వాసి, రాజధానిలో హ్యాపి నెస్ట్ నిర్మాణం చేపట్టిన ఎన్‌సీసీ కంపెనీ స్టోర్‌లో పనిచేస్తున్నాడు. గల్లంతైన మరో యువకుడు దినేశ్ ఆచూకి ఇంకా లభించలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి.

కాలువలో స్నానానికి దిగి యువకుడి గల్లంతు


కుంచాల ఏసుబాబు (ఫైల్‌ఫొటో)

మంగళగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి కాలనీ సమీపంలోని గుంటూరు చానల్‌లో స్నానానికి దిగి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. తాడేపల్లికి చెందిన కుంచాల ఏసుబాబు (22) తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల వద్ద ఉంటూ తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భవానీ మాల వేసుకున్న ఏసుబాబు లక్ష్మీనరసింహస్వామి కాలనీలో పనికి వచ్చాడు. తన మిత్రుడైన సహచర భవానీ శేషయ్యతో కలిసి గుంటూరు చానల్‌లో స్నానానికి దిగాడు. నీటి పారుదల ఎక్కువగా ఉండడంతో ఏసుబాబు నీటి ఒరవడికి కొట్టుకుపోయాడు. ఏసుబాబును రక్షించేందుకు శేషయ్య ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతయిన ఏసుబాబు ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

చంద్రబాబు విజన్ వల్లే పారిశ్రామిక విప్లవం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, సమర్థత వల్లే ఏపీలో పారిశ్రామిక విప్లవం మొదలైందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలతో పాటు, గతంలో పరిశ్రమల్ని తరిమేసిన రాజకీయ భూతం మరలా రాదన్న ముఖ్యమంత్రి భరోసా పారిశ్రామిక వేత్తల్ని ధైర్యంగా రాష్ట్రం వైపు ముందడుగు వేయిస్తోందన్నారు. 410 ఒప్పందాలు, రూ 9.80 లక్షల పెట్టుబడులతో విశాఖ భాగస్వామ్య సదస్సు సాక్షిగా నవ్యాంధ్రప్రదేశ్ పేరు ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా ప్రపంచాన్ని చుట్టేస్తున్నా రని అన్నారు. సుదీర్ఘ సముద్రతీరం, మానవనైపుణ్యాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ పాలసీ కూటమి ప్రభుత్వ సత్వర స్పందన పారిశ్రామి కవేత్తలను ఆకర్షిస్తున్నామని కొమ్మాలపాటి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

సీఐఐ సమ్మిట్‌కు ఏపీ సీఆర్‌డీఏ ప్రతినిధులు

- అమరావతిలో పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రదర్శన

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) బృందం నవంబరు 14, 15వ తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2025లో పాల్గొంటుందని కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. సోమవారం రాయపూడి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ప్రముఖ సంస్థల సీఈవోలు, డెవలపర్లు, విద్యా, వైద్యా, ఎలక్ట్రానిక్స్, మౌలిక వసతుల సంస్థలకు అమరావతి రాజధాని ప్రాంతంలో పెట్టుబడికి ఉన్న అవకాశాలను ఏపీ సీఆర్‌డీఏ బృందం విస్తృతంగా వివరిస్తుందని చెప్పారు. సమ్మిట్‌లో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, లాజిస్టిక్స్, మొబిలిటీ, హరిత ఇంధనం వంటి పలు విభాగాల అభివృద్ధి క్లస్టర్లను ఏపీ సీఆర్‌డీఏ ప్రతినిధి బృందం ప్రదర్శించనుందని చెప్పారు. పెట్టుబడిదారుల కోసం పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో రూపొందించిన ప్రాజెక్టు నమూనాలు, వ్యూహాత్మకంగా ఉన్న భూభాగాలు, అమరావతిలో నిర్మిస్తున్న 9 థీమ్ సిటీల గురించి వివరించనుందని చెప్పారు. అలాగే ఏపీసీఆర్‌డీఏ అందిస్తున్న సౌకర్యాలు, పెట్టుబడిదారుల కోసం అవలంబిస్తున్న విధానాలను ఈ సమ్మిట్‌లో ఏపీ సీఆర్‌డీఏ బృందం ప్రదర్శిం చనుందని కమిషనర్ కన్నబాబు తెలిపారు.

ఎంఎస్కే క్రికెట్ అకాడమీకి భూమిపూజ


ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంఎస్కే ప్రసాద్ కుటుంబసభ్యులు

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని పిచుకలపాలెం రెవెన్యూలో 12 ఎకరాలలో నిర్మించనున్న ఎంఎస్కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణా నికి సోమవారం భూమి పూజ జరిగింది. భూమి పూజలో భారత మాజీ క్రికెటర్ ఎంఎస్కే ప్రసాద్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. 12 ఎకరాల విస్తీర్ణంలో ఈ అకాడమీ రూపుదిద్దుకోనుంది. ఈ అకాడమీలో 400 మంది శిక్షణార్థులు, 1,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా నిర్మించనున్నారు. సందర్శక జట్ల కోసం వసతి, హాస్టల్ సౌకర్యాలు స్థానికంగా టోర్నమెంట్ల నిర్వహణకు మినీ క్రికెట్ స్టేడియం, అత్యాధునిక జిమ్‌లు, ఫిజి యోథెరపీ, పునరావాస కేంద్రం ఆధునిక ఫిట్‌నెస్, కండిషనింగ్ సదుపాయాలతో ఈ అకాడమీని నిర్మిస్తున్నారు. అమరావతిని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఆర్డీఏ ఈ అకాడమీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోంది.

వాటర్‌షెడ్.. పర్యావరణానికి పునాది

(5వ పేజీ తరువాయి)

అమలు చేసుకుంటాయనే దానిపై అభిప్రాయాలు సేకరించారు. రాజస్థాన్‌లో అభివృద్ధి చేసిన సరోవరం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జాన్సీలో వాటర్‌షెడ్ కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన నీటి వనరులను ప్రతీ ఒక్కరూ సందర్శించి స్ఫూర్తి పొందాలని అధికారులు సూచించారు. ల్యాండ్ స్కేపింగ్, వనరుల పరిరక్షణ ద్వారా పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ గురించి ఇక్రిశాట్ సంస్థ పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందర్నీ ఆకట్టుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని జాన్సీ జిల్లాకు చెందిన ఇక్రిశాట్ టీమ్ లీడర్ డాక్టర్ రమేష్ సింగ్ దీని గురించి వివరించారు. సాంప్రదాయ నీటి పొదుపు విధానాల గురించి న్యూఢిల్లీకి చెందిన అంతర్జాతీయ నీటి యాజమాన్య సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ గోపాల్‌కుమార్ విశ్లేషించారు. నదులు, సాంప్రదాయ నీటి సంరక్షణ విధానాల పునరుద్ధరణ, పర్వతశ్రేణుల్లో నీటి బుగ్గల పునరుద్ధరణ, గడ్డి మైదానాల అభివృద్ధి, వాటర్‌షెడ్ ప్రాజెక్టుల అమలులో హైడ్రాలజీ ప్లానింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీవోఎల్ఆర్ సెక్రెటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ నితిన్ ఖడే, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరి శశిభూషణ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణ తేజ, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా నమూనా

సదస్సులో భాగంగా ఐటీసీ హోటల్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ వాటర్‌షెడ్ 3డీ నమూనా ఏర్పాటు చేసింది. పచ్చని సోయగాల నడుమ, సరోవరం నుంచి నీరు జాలువారుతున్నట్లు రూపొందించిన ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది. చూడముచ్చటైన ల్యాండ్ స్కేపింగ్, ప్రజలకు నడక మార్గాలు వంటివి ఇందులో పొందుపరిచారు.

అదుపుతప్పిన ప్రైవేటు బస్సు

- ప్రయాణికులు సురక్షితం


అదుపుతప్పి పక్కకు ఒరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

రాజుపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం రెడ్డిగూడెం సమీపంలో హైదరాబాద్ నుంచి బాపట్ల వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కల్వర్టు వద్ద అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయింది. రెడ్డిగూడెం సమీపంలో ఉన్న చప్టా వద్దకు బస్సు వచ్చే సమయానికి బస్సును డ్రైవర్ అతి వేగంగా నడపడం వల్ల రోడ్డు మార్జిన్‌లోకి దిగి బస్సు పక్కకు ఒరిగిపోయింది. పక్కనే ఉన్న సిమెంట్ పైపుల సపోర్టుతో బస్సు కింద పడకుండా ఆగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

4 స్టార్ హోటల్‌కు నేడు భూమి పూజ

- వర్చువల్‌గా పాల్గొననున్న సీఎం చంద్రబాబు

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హోటళ్ల సంస్థ దసపల్లా గ్రూపు రాజధాని అమరావతిలో నిర్మించ తలపెట్టిన 4 స్టార్ హోటల్ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేయనుంది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొని శుభాకాంక్షలు చెప్పనున్నారు. పురపాలక మంత్రి పి.నారాయణ, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. శాఖమూరు రెవెన్యూ పరిధిలోని ఎన్జీవో క్వార్టర్స్ సమీపంలో దసపల్లా గ్రూపు ఛైర్మన్ ఎం.రాఘవేంద్ర రావు చేతుల మీదగా ఈ భూమిపూజ జరగనుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

42,823 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 44,605 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,823 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,346 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	16200	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14300	334	10500	16000
273	10500	14200	నెంబరు. 5	10000	14600
341	10000	16800	273	----	----
4884	----	----	341	10000	17000
సూపర్ 10	----	----	4884	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16500
బ్యాడిగి	10500	16700	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	-----	----	తాలుకాయలు	5000	8800

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

ఉద్యోగాల పేరిట మోసం చేసే దళారులను నమ్మవద్దు

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ● పీజీఆర్‌ఎస్‌కు 62 అర్జీలు

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేసే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి 62 మంది వచ్చి తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. అర్జీలు స్వీకరించిన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్చువల్ విధానంలో అర్జీలు గురించి జిల్లాలోని పోలీసుల అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని వారిసమక్షంలోనే సంబంధిత పోలీసు అధికారులతో వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. భార్యభర్తలకు సంబంధించిన వివాదాలు వస్తే వీలైనత వరకు ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చి వారి మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. హోమ్‌గార్డు పోస్టులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి ముందుగా డబ్బులు తీసుకొని ప్రజలను మోసం చేసే దళారుల మాటలు నమ్మి ఎవరు మోసపోవద్దని తెలిపారు. ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్‌ఎస్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసరావు, మహిళా ఎస్‌ఐ రాజ్యలక్ష్మి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నల్లమడ వాగు వరదల శాశ్వత పరిష్కారం చూపాలి

● నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలలో ప్రవహించే నల్లమడవాగు వరదల వలన లక్షలాది ఎకరాలలోని పంటలు నీళ్ళపాలై రైతులకు అపారనష్టం జరుగుతుందని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు అన్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ద్వారా వివరించారు. అనంతరం నల్లమడ రైతుసంఘం నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం వాగు 22,012 వేల క్యూసెక్కుల వరద నీటి సామర్థ్యం మాత్రమే ఉందన్నారు. గత నెలలో వచ్చిన వరద వల్ల 42,335 క్యూసెక్కుల వరద నీరు వచ్చినట్లు లెక్కించారన్నారు. ప్రభుత్వం స్పందించి నల్లమడ వాగు అభివృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు భూసేకరణ పూర్తిచేయాలని దీనికి వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మొంథా తుపాన్ రైతులను తీవ్రంగా నష్టపరిచిందని రైతులు పెట్టిన ఖర్చులను బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని వెంటనే ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు పువ్వాడ బసంత్‌కుమార్, గోవాడ సత్యనారాయణ, అడ్డగడ వెంకటేశ్వర్లు, గాంధీ, వెంకటరెడ్డి, కాపు సాంబశివరావు, గోవాడ సుబ్బారావు, కొండపాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద సమస్యను వివరిస్తున్న నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు తదితరులు

స్కాన్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

● జిల్లా ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి స్కాన్ సెంటర్ యజమాన్యం తప్పక పీసీపీ ఎన్‌డీటీ యాక్ట్ నిబంధనలు పాటించాలని జిల్లా ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. దీనికి విరుద్ధంగా ఎవరైన వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా అడ్వయిజరి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ టీనేజి ప్రెగ్నెన్సీ ఎక్కువగా ఉన్న ఏరియాలలో చిన్న వయస్సులో వివాహం చేసుకోవటం వల్ల కలిగే అనర్థాలు గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి హాస్పటల్, స్కాన్ సెంటర్, లేబరేటరీలలో తప్పనిసరిగా ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. రెగ్యూలర్‌గా ఫామ్ ఎఫ్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్స్ శాంతి వైష్ణవి, పీడియాట్రిషన్ డాక్టర్ సౌదన్య, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సుష్మా, డాక్టర్ లలిత రాజేశ్వరి, డాక్టర్ మనోజ్, డాక్టర్ మౌనిక, డాక్టర్ సాదిక్, ఎన్జీవోలు టి.ప్రసాదరావు, పి.మహ్మద్‌ఖాన్, సుగుణమ్మ, బి.మరియమ్మ, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు చెరుకుపల్లి విద్యార్థినుల ఎంపిక

చెరుకుపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : వినుకొండ లయోలా హైస్కూల్లో ఈనెల 8వ తేదీన జరిగిన జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల జిల్లా స్థాయి ఖోఖో సెలక్షన్స్‌లో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల చెరుకుపల్లి విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో యేమినేని దివ్యశ్రీ, అండర్-17 బాలికలలో ఉమాహర్షిత, కాటూరి వాసంతి, బాలల విభాగంలో లీలామోహన్‌కృష్ణ ఎంపికయ్యారు. వీరు నవంబరు 23వ తేదీన విజయనగరం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులకు, పీడీ శ్రీనివాసరావుకు ప్రధానోపాధ్యాయులు కాటూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



ఉపాధ్యాయులతో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

చెవికమ్మలను పోగొట్టుకున్న మహిళకు అందజేత

బాపట్లరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి సముద్ర స్నానానికి వచ్చిన మహిళ తన చెవికమ్మలను పోగొట్టుకున్నారు. ఈ విషయం తీరం ఒడ్డున ఔట్‌పోస్ట్‌లో ఉన్న ఏఎస్‌ఐ సుభానీకి, స్విమ్మర్ చెన్నకేశవులకు చెప్పటంతో వారు తీరం ఒడ్డున గాలించి ఆ చెవికమ్మలను వెతికి రూరల్ సీఐ చేతుల మీదుగా ఆ మహిళకు తిరిగి ఇచ్చారు.



మహిళకు చెవికమ్మలను అందజేస్తున్న పోలీసులు, గజఈతగాళ్ళు

అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
● పీజీఆర్‌ఎస్‌కు 218 అర్జీలు

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారం నాణ్యతతో ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 218 అర్జీలు నమోదయ్యాయి. అర్జీదారులు కలెక్టర్‌కు వినతిపత్రాల ద్వారా సమస్యలను వివరించారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ అప్పటికప్పుడే పరిష్కారం చూపారు. కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారించాలని సంబంధితాధికారులకు కేటాయించారు. ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తొలిసారిగా పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు వస్తే అధికారులు స్పందించి వారి అర్జీని పరిష్కరించాలన్నారు. ప్రజలు ఎవరైన రెండు పర్యాయాలు దాటి అర్జీలిస్తే నమోదు సమయంలోనే వారి ఆధార్‌కార్డు అనుసంధానంతో పింక్ స్లిప్ ధ్రువీకరణ పత్రం వస్తుందన్నారు. గతంలో వారు ఇచ్చిన అర్జీలు, వాటిపరిష్కారం వివరాలు వస్తాయన్నారు. ఆ క్రమంలోనే ఒక విశ్రాంత ఉద్యోగి కె.వెంకటప్రసాద్ పీజీఆర్‌ఎస్‌కు వచ్చి 8 అర్జీలు ఇచ్చారని తెలిపారు. వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులకు ఈ విషయాలపై అవగాహన కల్పించారు. పింకు స్లిప్ వస్తే వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి తక్షణమే పరిష్కారమార్గం చూపాలన్నారు. మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన మత్స్యకారులు, చేనేతలకు నిత్యవసర సరుకులు, పరిహారం తక్షణమే పంపిణి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ఇవ్వలేదని ఫిర్యాదులు రాకూడదన్నారు. విభిన్న ప్రతిభావంతులు కార్యాలయాలకు రావటానికి ర్యాంప్‌రైలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. లిఫ్ట్ సౌలభ్యం ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌కు అర్జీల ద్వారా సమస్యలు వివరిస్తున్న ప్రజలు

మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

కర్లపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల వాడకం వలన వచ్చే అనర్థాలు, ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించిన ఏజీఎంవో షేక్ యాసిన్ పాఠశాల విద్యార్థులకు వివరించారు. కర్లపాలెం మండల జడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమాజానికి, కుటుంబానికి, దేశానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదిగి ఆరోగ్యకరమైన దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సుగుణమణి, పీడీ మెర్సి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. యాజలి గ్రామంలో మాదక ద్రవ్యాల వాడకం, నిషేధం గురించి ఊరి ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు హెచ్‌ఎం సుగుణమణి తెలిపారు.

జిల్లెళ్ళమూడి అమ్మవారి లలిత కోటినామ పారాయణం

బాపట్లరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో ఉన్న హైమావతి దేవి అమ్మవారి జయంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీలలిత కోటినామ పారాయణ కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. రెండు తెలుగురాష్ట్రాలు నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ సంస్థ ద్వారా నడపబడుతున్న మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పలు రకాల సేవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. మాతృశ్రీ మెడికల్ సెంటర్ వారు ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు. స్వర్ణ కిరిటదారణిగా ఉన్న హైమావతి దేవి అమ్మవారిని చూడటానికి భక్తులు పోటెత్తారని సంస్థ కోశాధికారి జేఎల్‌వీ సుబ్రహ్మణ్యం తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో జిల్లెళ్ళమూడి అమ్మ

బాపట్లలో సినిమా తీస్తున్నా : దిలీప్‌రాజా

బాపట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో నూతన సినిమా షూటింగ్ చేస్తున్నట్లుగా సినీదర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. సినిమా చిత్రీకరణ నిమిత్తం సోమవారం ఆయన నిర్మాత పవన్ కుమార్‌తో కలిసి బాపట్ల, సూర్యలంక తదితర లోకేషన్‌లలో పర్యటించారు. అనంతరం దర్శకులు దిలీప్‌రాజా విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సినిమా చిత్రీకరణకు కావాల్సిన అందమైన లోకేషన్‌లు పూర్తిస్థాయిలో ఉన్నాయని వివరించారు. నిర్మాత పవన్ కుమార్ మాట్లాడుతూ సినిమాను పూర్తిగా పాటలతో సహా రాష్ట్రంలోనే చిత్రీకరిస్తామన్నారు. త్వరలో నటినటులు, సాంకేతిక నిపుణుల వివరాలు ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నటుడు మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు : ఇద్దరికి గాయాలు

కర్లపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెం పంచాయతీ జాతీయ రహదారిపై సిమెంట్ బ్రిక్స్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను కర్లపాలెం వైపు నుంచి వెళుతున్న కారు ఢీకొనటంతో కారు ధ్వంసమై కారులోని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. భీమవరంనకు చెందిన వ్యక్తులు కర్ణాటకలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారని, కారులో ప్రయాణం చేస్తూ కర్లపాలెం నుంచి బాపట్ల వైపు వెళుతుండగా నల్లమోతువారిపాలెం సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారని ఎస్‌ఐ తెలిపారు. కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి నిద్ర మత్తులో ఉండటంతో ఈ ప్రమాదం సంభవించిందని చెప్పారు. గాయాలైన వారిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.



కొల్లూరులో వరి కోతలు కోస్తున్న కూలీలు

వరి కోతలు ప్రారంభం

కొల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరి కోతలు సోమవారం ప్రారంభమయ్యాయి. కొల్లూరుకు చెందిన టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ వరి కోతకు శ్రీకారం చుట్టారు. మొంథా తుపాన్ ప్రభావంతో నేలవాలిన వరి పైరును కూలీలతో కోత కోయించారు. ఎకరానికి వరి కోత కోసేందుకు రూ.6 వేలు, రవాణా, ఇతర ఖర్చులు కలిపి మరో వెయ్యి రూపాయలు అదనంగా అవుతున్నట్లు మైనేని తెలిపారు. ప్రస్తుతం మూడు ఎకరాల వరి పంటను కోత కోయించినట్లు పేర్కొన్నారు. మంగళవారం మరో ఆరు ఎకరాలలో వరి కోతలు కోయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాధ్యతతో వాహనాలు నడపండి : సీఐ

కర్లపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు బాధ్యతతో వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారణకు కృషి చేసిన వారు అవుతారని బాపట్ల సర్కిల్ సీఐ హరికృష్ణ అన్నారు. కర్లపాలెం ఐలెండ్ సెంటర్‌లో సోమవారం రాత్రి వాహనదారులకు రోడ్డుప్రమాదాల నివారణపై ఎస్‌ఐ రవీంధ్ర అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఐ హరికృష్ణ వాహనదారులతో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు దొరికితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రవీంధ్ర, పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌తో పిచ్చిమొక్కల తొలిగింపు

కర్లపాలెం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం నర్రావారిపాలెంలో రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను ఎక్స్‌కవేటర్‌తో సర్పంచ్ నక్కల శేషాద్రి, కార్యదర్శి దివ్య తొలగింపజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంకయ్య పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

కర్లపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పాతూరు గ్రామంలో నిరుపేద మహిళలకు శ్రీ ఛత్రపతి మహరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజీరాజు మాట్లాడుతూ పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు, దుప్పట్లు, అనారోగ్యం ఉన్న వారికి ఆర్థికచేయూతను సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూనం కృష్ణ, తూనుగుంట్ల రామ్మోహనరావు, మంతెన సతీష్‌కుమార్‌రాజు, పెనుమెత్స భార్గవ, శివరామరాజు, కృష్ణకాంత్, రాజశేఖర్, భాగ్యరాజు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయవద్దు

రేపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేదలకు వైద్యం అందించేందుకు గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సేవ్‌మెడికల్‌కాలేజీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కోటి సతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిమటా బాలాజీ, కరేటి శేషగిరిరావు, చదలవాడ శ్రీనివాసరావు, కేవీ కృష్ణారెడ్డి, నాగలక్ష్మి, ఖుద్దూస్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు

కొల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళా భక్తులు మండల పరిధిలోని చిలుమూరు, కోటిపల్లి, కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి తదితర దేవాలయాల ప్రాంగణాల్లో కార్తీక దీపారాధన పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కార్తికమాసం మూడో సోమవారం మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నాలుగు గంటల నుండే మహిళలు దేవాలయాలలో 108 హారతులు వెలిగించి, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో నడింపల్లి శిఖరేశ్వరస్వామి

శ్రీరామమందిరంలో దీపాలంకరణ

కర్లపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామంలో శ్రీ సీతారామమందిరంలో గ్రామసర్పంచ్ గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ, జగ్గయ్య ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున ప్రమీదలలో దీపాలు వెలిగించారు. శివలింగాకృతి, స్వస్తిక్, ఓం, శ్రీరామ, శ్రీవేంకటేశ్వరుని శంఖు, చక్రం పలు ఆకృతులను ప్రమీదలతో దీపాలు వెలిగించారు. కార్తికమాస శోభఉట్టిపడేలా రామమందిర ప్రాంగణంలో దీపాల వెలుగులు వెల్లువిరిశాయి.



ప్రమీదల దీపాలతో శివలింగాకృతి

కర్లపాలెంలో కోటిదీపోత్సవం

కర్లపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కార్తీకమాసం సందర్భంగా బోలాయిపాలెం పురోహితులు శర్మ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కోటిదీపోత్సవ కార్యక్రమాన్ని భక్తులు, పుణ్య దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రుద్రాభిషేకం, దామోదరపూజ తదితర పూజా కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కోటి దీపోత్సవ కార్యక్రమాలను తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, లలితబాబు, బొమ్మిశెట్టి కిషోర్, గుప్తా, నందిపాటి నాగమల్లేశ్వరరావు, కోడూరి చంద్ర, పబ్బిశెట్టి వెంకటరంగారావు తదితరులు పర్యవేక్షించారు.



కోటి దీపోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

శ్రీరామలింగేశ్వరస్వామికి ...

పిట్టలవానిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతెనవారిపాలెం గ్రామంలో కార్తిక మూడో సోమవారం సందర్భంగా శ్రీ గంగపర్వత వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించి అనంతరం స్వామి వారి దివ్య దర్శనం భక్తులకు కల్పించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.



శ్రీరామలింగేశ్వరస్వామి

బాలకోటేశ్వరస్వామి ధర్మకర్తలమండలి ప్రమాణ స్వీకారం

రేపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కుమార్‌బాబు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులను మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పంతాని మురళీధరరావు, సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, దుర్గామల్లేశ్వరస్వామి ట్రస్టుబోర్డుసభ్యులు జీవీ నాగేశ్వరరావు, తాతా ఏడుకొండలు, మేకా రామకృష్ణ, జీపీ రామారావు, సీవీ మోహన్‌రావు, ఆగస్త్య, కొమ్మూరు వెంకటేష్, గుర్రం మురహరిరావు, దండుప్రోలు పిచ్చియ్య, ఈవోలు దివి వెంకటఅప్పలాచార్యులు, మేకా సాంబశివరావు, మాజీ ఈవో కొత్త దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



ధర్మకర్తలమండలి సభ్యులతో అనగాని శివప్రసాద్ తదితరులు

ఇసుక క్వారీలో అన్ని గ్రామాల ట్రాక్టర్లకు లోడింగ్ చేయాలి

● సీపీఎం నాయకుల డిమాండ్

కొల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్వారీలో అన్ని గ్రామాల ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, గాజుల్లంక ఇసుక క్వారీలోకి ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్లను రానివ్వడం లేదని, కేవలం ఆ ఒక్క గ్రామానికి చెందిన ట్రాక్టర్లు మాత్రమే ఇసుక నింపుకుంటున్నట్లు ఆరోపించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అందించారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ కార్మికులు మేడికొండ బాలకృష్ణ, సీతారామయ్య, ప్రసన్నబాబు, నాగరాజు, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ట్రాక్టర్ నిర్వాహకుల ఆందోళన....

పెసర్లంక, గాజుల్లంక గ్రామస్తులు తమ పరిధిలో ఇతర గ్రామాల ట్రాక్టర్లకు ఇసుక తవ్వకాలకు అనుమతించమని చెప్పడంతో కొల్లూరు, తోకలవానిపాలెం, క్రీస్తులంక గ్రామాలకు చెందిన ట్రాక్టర్ నిర్వాహకులు కొల్లూరులోని లాకు సెంటర్, దోనేపూడి, తోకలవానిపాలెం గ్రామాల వద్ద ఇసుకతో వస్తున్న ట్రాక్టర్లను నిలిపి వేసి ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు ఇసుక తవ్వకాలను అనుమతించబోమని, పెసర్లంక, గాజుల్లంక గ్రామాల పరిధిలో ఉన్న కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా గ్రామాల వద్ద పికెటింగ్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డు

● గ్రీవెన్స్‌లో ప్రజల ఫిర్యాదు

వేమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన వేమూరు పంచాయతీ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డును వాడకంలోకి తేకుండా నిరుపయోగంగా వదిలేశారు. గ్రామంలో పోగు చేసిన చెత్తా చెదారంతో పాటు జంతు కళేబరాలను దుర్గంధ భరితమైన ఇతర వ్యర్థ పదార్థాలను కార్మికులు వేమూరు నుంచి చినపులివర్రు వెళ్లే మార్గంలోను రోడ్డుపైకి కూడా గుట్టలుగా పడవేస్తున్నారు. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించే ప్రయాణికులకే కాకుండా పొలాలకు వెళ్లే రైతులకు ఈ మార్గంలో ప్రయాణించే అవకాశం లేకుండా పోయింది. రావికంపాడు, అబ్బనగూడవల్లి, చినపులివర్రు గ్రామాలకు చెందిన పలువురు రైతులు, ప్రజలు గతంలో అధికారులకు సమస్య పరిష్కరించాలని తెలియజేసిన స్పందించలేదు. భరించలేని మూడు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సుశీలకు తమ సమస్యను వివరిస్తూ అర్జీ దాఖలు చేశారు. స్పందించిన తహసీల్దార్ తక్షణ చర్యలు నిమిత్తంగా ఎంపీడీవో పి.రవికుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.



వేమూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చిత్రం

ఎన్టీఆర్‌నగర్ సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ నగర్‌లో మౌలికవసతులు కల్పన చేయాలని సీపీఎంరేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. సోమవారం 18వవార్డులోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్‌నగర్ పెట్రోల్ బంక్ వెనుక కాలనీలో ఇళ్ళ మధ్య వర్షంనీరు నేటికి ఉన్నాయని, డ్రైయినేజీలు, రహదారులు లేకపోవటంవలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధి దీపాలు వెలగటం లేదని, మున్సిపల్ అధికారులు తక్షణమే దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వి.ధనమ్మ, కె.నాంచారయ్య, సింధూదేవి, డి.ఆగస్టీన్, కె.ఆశీర్వాదం, రాము తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఎం, కాలనీవాసులు

ఈత పోటీలకు అచ్యుతరామరాజు ఎంపిక

పిట్టలవానిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో మండలంలోని అలకాపురం గ్రామపంచాయతీకి చెందిన బేతాళం అచ్యుతరామరాజు రాష్ట్రస్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తమ ప్రతిభను కనబరిచారు. విజయవాడలో నిర్వహించిన స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో సుమారు 70-74 వయస్సు మధ్య గ్రూపులలో బేతాళం అచ్యుతరామరాజు గోల్డ్‌మెడల్, మూడు సిల్వర్‌మెడల్ సాధించారు. అదేగ్రామానికి చెందిన బి.హర్షవర్ధన్ విశాఖ పట్టణంలో జరిగిన అండర్-19 స్కూల్‌గేమ్స్ స్టేట్ మీట్‌లో రెండు గోల్డ్‌మెడల్స్, ఒకబ్రౌంజ్ మోడల్ సాధించి జిల్లాలో స్విమ్మింగ్‌లో కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. బాపట్ల జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ మెంబర్స్ వారికి అభినందనలు తెలిపారు.



స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన బేతాళం అచ్యుతరామరాజు

నరసరావుపేట మండలం గురవాయపాలెంలో బంతిపూల తోట



బంతిపూల సాగు భలే బాగు

ఓ వైపు వరుస ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు ధరలు లేక వాణిజ్య పంటలను సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారు. కొంతమంది రైతులు మాత్రం ఉద్యానవన పంటల సాగుకు శ్రీకారం చుట్టి వాణిజ్య పంటల సాగుకు గుడ్ బై చెబుతున్నారు. ముఖ్యంగా బంతి పూల సాగును చేపట్టి లాభాలు గడిస్తున్నారు. పెట్టిన పెట్టుబడికి తక్కువ కాకుండా చేసిన కష్టానికి తగ్గట్టుగా అదనంగా ఆదాయం వస్తుందన్న నమ్మకం పూల తోటల సాగులో లభిస్తుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● ఎకరాకు రూ.లక్ష ఆదాయం
● రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న పంట
● వాణిజ్య పంటల సాగుకు రైతుల స్వస్తి

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలంలో పలు గ్రామాల్లో రైతులు బంతి పూల సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. నరసరావుపేట మండలంలోని గురవాయపాలెం, గోనెపూడి, రావిపాడు, ములకలూరు, పమిడిపాడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు బంతిపూలను సాగు చేస్తున్నారు. ఎకరం బంతిపూల సాగుకు దుక్కులు దున్నించిన తర్వాత నారుకు సంబంధించి మొత్తం పదివేల మొక్కలు పడతాయి. ఒక్కో మొక్క రూ. 3 చొప్పున వేయడానికి 30 వేల ఖర్చ వస్తోంది. ఎరువులకు రూ. 25,000, పురుగు మందులకు రూ. 30,000, కూలీలకు రూ. 15,000 ఖర్చులు కలిపి మొత్తం ఎకరానికి రూ.లక్ష వరకు అవుతుంది. మొక్క వేసిన దగ్గర నుంచి 120 రోజుల వ్యవధిలో పూలసాగు పూర్తవుతుంది. భూమిలో మరో పంటను కూడా వేయవచ్చు. మొక్కను నాటిన రెండు నెలల తర్వాత నుంచి పూలు పూతకు వస్తాయి. 60 రోజులపాటు పూల దిగుబడి వరుసగా వస్తూనే ఉంటుంది. తక్కువ మంది కూలీలతో ఎక్కువ పూలను కోసే అవకాశం ఉండటంతో కూలీల కొరతను అధిగమించే అవకాశం ఉంటుంది. ఎకరం పూల తోట నుంచి సుమారు 70 క్వింటాళ్ల వరకు పూల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. సీజన్‌ను బట్టి పూలకు మంచి ధర ఉంటుంది. నాలుగు నెలల వ్యవధిలో బంతిపూల సాగు పూర్తి కావడంతోపాటు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తోందని రైతులు తెలిపారు. మార్కెటింగ్ కష్టం లేకుండా పొలం వద్దకే వచ్చి పూలను తీసుకెళ్తుంటారు. కూలీల కొరతను అధిగమించడంతోపాటు రెండు నెలల కాలంలో దిగుబడి పూర్తవడం, ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుండడంతో బంతి పూలసాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

నష్టాల నుంచి గట్టెక్కేందుకు పూలబాట

వాణిజ్య పంటలకు స్వస్తి పలికిన రైతులకు బంతి సాగు నష్టాల నుంచి గట్టెక్కించే పూలబాటగా మారింది. పండుగలు శుభకార్యాలతో పాటు కార్తిక మాసంలో భక్తులు ఆచరిస్తున్న వ్రతాలు, ప్రత్యేక పూజలు, దీక్షాపరుల మాలలు ధరించటంతో ప్రతి పూజకు పూలను వినియోగించాల్సి ఉండటంతో పూలకు మంచి గిరాకి ఏర్పడింది. మండపాల అలంకరణలకు కూడా పూల అవసరం ఉండటంతో ప్రస్తుతం కేజీ పూల ధర రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. ఒక ఎకరం బంతి సాగుకు దిగుబడి కాస్త అటు ఇటు అయినప్పటికీ అన్ని ఖర్చులు పోను నమ్మకంగా రూ.లక్ష ఆదాయం మిగులుతుందని రైతులు చెబుతున్నారు.

వేటపాలెం ఎడ్లకు ప్రథమస్థానం

దుర్గి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో హరిహర బాలనాగేంద్ర స్వామి తిరునాళ్లను పురస్కరించుకొని సోమవారం నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. న్యూ కేటగిరి విభాగం పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత ప్రథమస్థానం కైవసం చేసుకుంది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత రెండోస్థానం, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెం ఎడ్లజత గూడవల్లి లక్ష్మీ దీక్షిత చౌదరి ఎడ్లజత మూడోస్థానం కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం వీర్లపాడుకు చెందిన మంగు రమాదేవి ఎడ్లజత నాలుగోస్థానాన్ని, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత ఐదోస్థానాన్ని, పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లికి చెందిన పిక్కిలి తేజస్సు మురళి ఎడ్లజత ఆరోస్థానంలో, గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన గుడిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లజత ఏడోస్థానంలో నిలిచాయి. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించగా పోటీలను తులసీ సీడ్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి కృష్ణచైతన్య, పులి హరి, వెలిదండి గోపాలరావు (రిటైర్డ్ ఎల్ఐ), గుండాల వెంకటేశ్వర్లు, కొత్తా వెంకటేశ్వర్లు, ఆకుల రామలక్ష్మయ్య, తోటకూర శ్రీను, వంకమళ్ల కోటేశ్వరరావు, భీమా అమరయ్య, నాగెండ్ల శ్రీను, వెలిదండి శ్రీను, జక్కా ఏడుకొండలు, గోపిలు పర్యవేక్షించారు. మంగళవారం ఆరుపళ్ల విభాగంలో పోటీలు జరగనున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు.


ప్రథమస్థానంలో నిలిచిన బాపట్ల జిల్లా ఎడ్లజత

కలెక్టర్‌తో ఎమ్మెల్యే యరపతినేని భేటీ

● గురజాల పారిశ్రామిక కారిడార్ గురించి వివరణ

పిడుగురాళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కలెక్టర్ కృతికా శుక్లా దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం పిడుగురాళ్ల ఆర్అండ్‌బీ బంగ్లాలో యరపతినేని, కలెక్టర్ శుక్లాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పిడుగురాళ్లలో ఉన్న సున్నం పరిశ్రమలన్నింటినీ ఒకేచోట ఏర్పాటు చేసే ఆలోచన గురించి ఇప్పటికే వ్యాపారులతో మాట్లాడామని, అన్ని పరిశ్రమలను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేస్తే వారికి కావలసిన మౌలిక వసతులు, బ్యాంక్ రుణాల విషయమై ప్రభుత్వంతో మాట్లాడతామని చెప్పామని ఎమ్మెల్యే యరపతినేని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ, యరపతినేని చెప్పే ప్రాజెక్టు విజయవంతమైతే జిల్లాకే హైలెట్‌గా మారుతుందని, దానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరిచే దిశగా మంగళవారం ప్రకాశం జిల్లాలోని కనిగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో ఎంఎస్ఎంఏలను ప్రారంభిస్తున్నారని, అందులో భాగంగా దాచేపల్లి సమీపంలోని నడికూడి ఇండస్ట్రియల్ ఏరియాలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన జరగనుందని తెలిపారు. పిడుగురాళ్ల, కోనంకి గ్రామాలలో భూసమస్యలను త్వరగా క్లోజ్ చేయాలని గురజాల ఆర్డీవో మురళీకృష్ణను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు.


పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచర్ల కొత్తపల్లిలో సెజ్

● కేంద్రానికి నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
● ఆమోదం పొందితే భారీగా పరిశ్రమల రాక

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లిలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్ర వ్యాప్తంగా 32 పారిశ్రామికవాడలు (ఎస్ఈజెడ్)ల ప్రతిపాదనలను డీపీఐఐటీకి పంపగా వాటిల్లో మాచర్లను కూడా చేర్చింది. వైద్య పరికరాలు, మెడ్-టెక్ ఎస్ఈజెడ్‌గా దీనిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించింది. ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటం కూడా ప్లస్ పాయింట్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే కొత్తపల్లి మెడికల్ ఫీల్డ్‌కు హబ్‌గా మారుతుంది. అనేక ఫార్మా, వైద్య పరికరాలు తయారు చేసే సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తాయి. దాంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారవర్గాలు తెలిపాయి.

● అభివృద్ధికి బాటలు

పల్నాడు జిల్లాలో మాచర్ల నియోజకవర్గం వెనకబడిన ప్రాంతంగా ఉంది. ఈ ప్రాంతం కక్షలు, కార్పణ్యాలకు ఒకప్పుడు నిలయంగా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పగలు, ప్రతీకారాలను ఆ పార్టీ నాయకులు పెంచి పోషించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనే ఊసే అక్కడ లేకుండా పోయింది. అటువంటి ప్రాంతంలో ఒక సెజ్‌ను ఏర్పాటు చేస్తే అభివృద్ధికి బాటలు వేసినట్లు అవుతుందని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల ద్వారానే మాచర్ల ప్రాంతంలో ఫ్యాక్షనిజాన్ని దూరం చేయొచ్చని విశ్వసిస్తూ మెడ్‌టెక్ సెజ్‌ను ప్రతిపాదించింది. దీనికి కేంద్రం నుంచి తప్పక ఆమోదం లభించే అవకాశాలున్నట్లు సమాచారం. సెజ్ వస్తే అందులో వైద్య, సంబంధిత రంగాల పరిశ్రమలు ఏర్పాటవుతాయి. దాంతో ఆ ప్రాంతానికి రెవెన్యూ సమకూరుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. ఆయా పరిశ్రమలకు వస్తువులు, పరికరాలు సమకూర్చే ఇతర సంస్థల ద్వారా కూడా పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

సీటీ శాఖలో ఇన్‌చార్జీల పాలన

● కార్యాలయాల్లో నత్తనడకన పనులు ● బాధ్యతా రాహిత్యంగా సిబ్బంది



వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ గుంటూరు నోడల్ డివిజన్ పరిధిలో పలు అధికారుల పోస్టులు ఇన్‌చార్జీలతోనే కొనసాగుతున్నాయి. చాలా కాలం నుంచి ఆయా పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జీ అధికారులు వాటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దాంతో సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. కీలకమైన గుంటూరు-2 డివిజన్ మేనేజర్ స్థానం నెలల తరబడి ఖాళీగా ఉంటోంది. అరండల్‌పేట, పట్నంబజార్ డీసీటీవోలు, అలాగే నరసరావుపేట సర్కిల్‌లో ఒకటి, గుంటూరు 2 డివిజన్ కార్యాలయంలో రెండు అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుంటూరు 1 డివిజన్, బ్రాడీపేట, తెనాలి సర్కిల్స్‌లో పని చేసే అసిస్టెంట్ కమిషనర్‌లు ఇప్పటికే పదోన్నతులు పొంది పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే జోన్ 3కి చెందిన జీఎస్‌టీవో పోస్టులు గుంటూరు నగరంలో నాలుగు, కమిషనర్ కార్యాలయంలో మూడు, రీజినల్ కార్యాలయం విజయవాడలో నాలుగు పోస్టులు ఆరు నెలలకు పైగా ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టులకు అర్హులైన ఉద్యోగులు పదోన్నతులు లభిస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులకు పదోన్నతులు కల్పించాలని ఇప్పటికే ఆ శాఖ ముఖ్య కమిషనర్‌ను పలు ఉద్యోగ సంఘాలు కలిసి కూడా విజ్ఞప్తి చేశాయి. సిటీ శాఖలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 సంవత్సరంలో అడ్డగోలుగా చేసిన సంస్కరణల కారణంగా పలువురు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు గత మూడేళ్లుగా తమ డివిజన్, జోన్ పరిధి దాటి బయట ప్రాంతంలో పనిచేస్తున్నారు. వారికి డిప్యూటేషన్‌ల అవకాశం కల్పించాలని అనేక దఫాలుగా ఉద్యోగ సంఘాల నాయకులు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించారు. ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఉన్నతాధికారులు స్పందించాలి

వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా చేసిన సంస్కరణల ఫలితంగా వాణిజ్యపన్నుల శాఖలో పలువురు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగుల సొంత డివిజన్‌లు, జోన్‌ల పరిధి దాటి వేరొక డివిజన్‌లలో విధులు నిర్వహించటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం డిప్యూటేషన్‌లకు అవకాశం కల్పించాలన్న విజ్ఞప్తులనైనా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. అలానే అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి ఇన్‌చార్జీల పాలనకు తెరతీయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

వాటర్ షెడ్ మహోత్సవ్ సభకు

సర్వం సిద్ధం

● పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు

గుంటూరు (తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం నల్లపాడు లయోలా పాఠశాలలో మంగళవారం జరిగే వాటర్‌షెడ్ మహోత్సవ్ సభకు జిల్లా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. వాటర్‌షెడ్ మహోత్సవ్ సభలో పాల్గొనేందుకు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యేలు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. తొలుత చెరువును స్వయంగా పరిశీలించి, అతర్వాత నల్లపాడు లయోలా పాఠశాలలో జరిగే మహోత్సవంతో వారు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం పంచాయతీ రాజ్ కమీషనర్ కృష్ణ తేజ, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సభా వేదికను పరిశీలించి, ఏర్పాట్లపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా, వాటర్ షెడ్ మహోత్సవంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అపూర్వ స్వాగతం పలికేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రింగు రోడ్డు నుంచి బైక్, కార్ల ర్యాలీతో ఆయనను సభ వరకు తీసుకువెళ్లేందుకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు.


కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు స్వాగతం పలుకుతున్న సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరుకు చేరుకున్న కేంద్ర మంత్రి చౌహాన్

గుంటూరు: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వాటర్ షెడ్ మహోత్సవ్‌లో పాల్గొనేందుకు గుంటూరు నగరానికి చేరుకున్నారు. సోమవారం రాత్రి ఆయన భువనేశ్వర్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు విమానంలో రాగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అక్కడికి వెళ్లి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి గుంటూరు నగరంలోని ఐటీసీ వెల్‌కం హోటల్‌కు చేరుకున్నారు.


24న అస్మిత అథ్లెటిక్స్ లీగ్ ఎంపికలు

గుంటూరు (క్రీడలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న ఏఎన్‌యూలో అండర్ 14,16 బాలికల విభాగంలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ అఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం బీఆర్ స్టేడియంలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీల పోస్టర్‌ను జిల్లా క్రీడల అధికారి అఫ్రోజ్, అంతర్జాతీయ అథ్లెటిక్ క్రీడాకారుడు కృష్ణమోహన్, అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలికల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ గల బాలికలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ కేంద్రాలకు, జాతీయ అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాలకు ఎంపికవుతారని తెలిపారు. క్రీడాకారిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారిణులకు ఇది సువర్ణావకాశమని అన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారిణిలకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 21వ తేదీలోపు తమ ఎంట్రీలను యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9666635296 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌కు చెందిన జాతీయ క్రీడాకారుడు పి.వెంకటేశ్వర్లు, జిల్లా అథ్లెటిక్ సంఘం సభ్యుడు ఏవీ ఆంజనేయులు, స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ కోచ్‌లు ఎస్.శివారెడ్డి, వెంకటేశ్వరరావు, హిందూ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రవి, మాజీ క్రీడాకారుడు ఎస్కే మన్సూర్ వలి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రకాశం బ్యారేజీ వద్ద తగ్గిన వరద ఉధృతి

● దిగువకు 18,125 క్యూసెక్కుల నీటి విడుదల


ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల, ప్రధాన వాగుల నుంచి 27,587 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదవగా.. 18,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 3,709 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 45.56 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 32,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, గేట్ల ద్వారా 24,335 క్యూసెక్కుల నీరు, మొత్తం 41,335 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

సాగర్ ప్రాజెక్టు నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 589 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5,654 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,226 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 51,680 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 51,680 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాల ప్రాజెక్టులో 1.0272 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0272 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 4 గేట్ల ద్వారా 22,640 క్యూసెక్కులు, టేల్ రేస్ చానల్ ద్వారా 8,480 క్యూసెక్కులు మొత్తంగా 31,120 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 32 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని చెప్పారు.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

● డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్ఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు తెలిపారు. ధాన్యం కొనుగోలుపై గుంటూరు కోర్టు రోడ్డులో ఉన్న డీసీఎమ్ఎస్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ఒక్క రైతుకు నష్టం రాకుండా సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ. 2,389, కామన్ గ్రేడ్‌కు రూ. 2,369 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి రైతు నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు డీసీఎమ్ఎస్ సంస్థ సర్వం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గంటా వినయ్



గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అనుబంధ విభాగం రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు నగరంపాలెంకు చెందిన గంటా వినయ్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఐదు రాష్ట్రాల ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నగరానికి చెందిన గంటా వినయ్ నాయుడు కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో అనేక పదవులు నిర్వహించారు. అనంతరం ఆర్‌జీపీఆర్ఎస్ జాతీయ కార్యదర్శిగా తమిళనాడు, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ నాయుడుకు పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలియజేశారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 18 ఏళ్లుగా వైద్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం వైద్యశాఖ సెకండ్ ఏఎన్ఎంల ధర్నా జరిగింది. ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ధర్నాలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మినిమం టైం స్కేలు ప్రకారం వేతనం చెల్లించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరిని రెగ్యులర్ చేయడంతో పాటు సచివాలయాల్లో ఖాళీ పోస్టుల భర్తీ సమయంలో వీరికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయకుమార్, కొండలు, లీల, మరియమ్మ, మల్లేశ్వరి, రవికుమారి, యాస్మిన్, సుజాత, కోటమ్మ, అపర్ణ, లక్ష్మీదేవి, విజయకుమారి,ప్రమీల తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అందెశ్రీ మృతికి పలువురి సంతాపం


అందెశ్రీ(ఫైల్)

ఒంగోలు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):సోమవారం మృతి చెందిన ప్రముఖ ఆశు కవి, వాగ్గేయ కారుడు డాక్టర్ అం దెశ్రీ మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు కవులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగాంకు చెందిన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఆయనకు మన జిల్లాతో, జిల్లా కవులతో కూడా మంచి పరిచయాలు ఉన్నాయి. గతంలో జిల్లాలో జరిగిన మహాకవి గుర్రం జాషువా జయంతి సభలో ఆయన పాల్గొని తన కవితా ప్రసంగంతో తన్మయులను చేశారు. అందెశ్రీ మృతి పట్ల నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, జనసాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్.జి.వి.కృష్ణయ్య, నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు, కత్తి కల్యాణ్, డాక్టర్ నూకతోటి రవికుమార్, దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, అంగలకుర్తి ప్రసాద్, చప్పిడి కోటేశ్వరరావు, రెబ్బవరపు ఉదయ్, గంగవరపు సునీత, మున్నంగి రాజకుమారి, డాక్టర్ నూనె అంకమ్మ రావు, కుర్రా ప్రసాద్ బాబు, బీరం అరుణ తదితరులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

16న ఒంగోలులో 'సనాతన ధర్మం- ప్రజాస్వామ్యం'పై సదస్సు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సైంటిఫిక్ సోషలిస్టు స్టడీ సర్కిల్ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 16వతేదీన స్థానిక సీపీఐ కార్యాలయంలో సనాతనధర్మం-సామాజిక అంతరాలు- ప్రజాస్వామ్యం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు స్టడీసర్కిల్ నిర్వహణ ప్రతినిధి ఎం. వెంకయ్య తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదస్సులో ప్రముఖ సామాజిక, సాంస్కృతిక విశ్లేషకురాలు పీపీ దేవి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతంచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసులు, ఆర్. శివనాగేశ్వరరావు, బేగ్, నల్లూరి క్రాంతి, కే వెంకటేశ్వర్లు, బి. రామారావు, పిచ్చయ్య, శిఖా చంద్రశేఖర్ బాబు,పీ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.


ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో మాట్లాడుతున్న మేయర్ సుజాత

క్విస్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ఒంగోలు విద్య, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు క్విస్ ఫార్మసీ కళాశాలలో వికసితభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో నగర పరిధిలోని వెంగముక్కలపాలెంలో సోమవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక శిబిరాలను మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించేందుకు ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధన మూర్తి, స్టైప్ సిబ్బంది,విద్యార్థులు ఉన్నారు.

క్విస్‌లో ఫ్యాకల్టీ కార్యక్రమం

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఫ్యాకల్టీడెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, గాయత్రిదేవిలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఇస్రో మాజీసైంటిస్టు టీఎస్ రఘురామ్, కళాశాల ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, మెకానికల్ హెచ్‌వోడీ సమీరకుమార్, డీపీఎస్ఆర్ డైరెక్టర్ సుబ్బారావు ఉన్నారు.

అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాగుడ్లూరు మండలం చేవూరులో అటవీ భూములను రామదూత స్వామి నుంచి స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్‌చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, గుమ్మళ్ళ నరసింహారావు, కాలేషా బేగ్, సుభాని, రంగారెడ్డి, పిచ్చయ్య ఉన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

ఒంగోలు నియోజకవర్గ పరిధిలో రూ.92 కోట్లు నష్టం

కేంద్ర బృందానికి ఎమ్మెల్యే దామచర్ల వినతి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ కారణంగా ఒంగోలు నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖలలో మొత్తం రూ. 92 కోట్లు నష్టం వాటిల్లిందని, బాధితులను ఆదుకుని నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కేంద్ర బృందాన్ని కోరారు. సోమవారం ఒంగోలు విచ్చేసిన కేంద్ర బృందాన్ని కొత్తపట్నం మండలం చింతల వద్ద ఎమ్మెల్యే దామచర్ల కలిసి నష్టం వివరాలను తెలియజేశారు. ఆక్వా సెక్టార్‌కు సంబంధించి రొయ్యలు, చేపలు చెరువుల సాగులో 312 హెక్టార్లలో రూ. 19.94 కోట్లు నష్టం వాటిల్లగా, ఒంగోలు నగర పరిధిలోని డ్రైన్‌లు, సీసీ రోడ్‌లు, కల్వర్టులు దెబ్బతిన్నాయని, వాటి నష్టం విలువ రూ. 19.91 కోట్లు ఉందని వివరించారు. అలాగే ఒంగోలు అర్బన్, రూరల్ పరిధిలో తుఫాన్ కారణంగా పంట నీట మునిగి, రైతులు నష్టపోయారని, 850 ఎకరాలలో రూ. 81.41 లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అలాగే ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని రోడ్డు దెబ్బతిని రూ. 47.99 కోట్లు, ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఒంగోలు రూరల్ పరిధిలోరూ. 2.97 కోట్లు నష్టం వాటిల్లినట్లు కేంద్ర బృందానికి ఐదు నివేదికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.


కేంద్ర బృందానికి నష్టం వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

దెబ్బతిన్న పంటలు పరిశీలించిన కేంద్ర బృందం

నాగులుప్పలపాడు : మొంథా తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలసి మంగళవారం సాయంత్రం పరిశీలించింది. తొలుత చదలవాడ వద్ద తుపాన్ ప్రభావంతో నీటమునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, అనంతరం నాగులుప్పలపాడు - ఉప్పుగుండూరు రోడ్డులోని రైతుబంధు కోల్డ్‌స్టోరేజి వెనుక దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. అనంతరం చీరాల బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏడీఏ రమేష్ బాబు, ఏవో వెంకట్రావు,తహశీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కౌలురైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్ : మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కేంద్ర బృందం సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పలు అంశాలను బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. అధిక వర్షాల వల్ల జిల్లాలో 25వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, అందులో కౌలు రైతులు అధికంగా ఉన్నారన్నారు. పంటల నష్టం కౌలు రైతుల పేరుమీద రాసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.


నాగులుప్పలపాడు వద్ద దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కేంద్రబృందం


కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తుఫాన్‌కు నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌కు నష్టపోయిన జిల్లా ప్రజలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు.సోమవారం ఒంగోలు వచ్చిన కేంద్ర బృంద సభ్యులు సౌసమి బసు, మహేష్‌కుమార్, శేఖర్ రాయ్, సాయిభగీరధిలను కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా సీపీఎం జిల్లాకార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ మొంథా తుఫాన్ జిల్లాను తీవ్రంగానష్టపర్చిందని, రెండు రోజుల్లో 18.40 సెం.మీ. వర్షపాతం నమోదైందన్నారు. దీంతో ముంపు సమస్య తీవ్రంగా ముందుకు వచ్చిందన్నారు, మరో వైపురహదారులు కూడా దెబ్బతిన్నాయన్నారు. పలు రకాలపంటలు కూడా దెబ్బతిన్నాయని,అందువల్ల కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు, బృందాన్ని కలిసిన వారిలో సీపీఎం నాయకులు జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, పమిడి వెంకట్రావు, ఎం.రమేష్, బి.రఘురాం తదితరులు ఉన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కుతో ఉపాధి, ఉద్యోగాలు

మంత్రి స్వామి

నెన్నూరుపాడులో మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు

టంగుటూరు (కొండపి), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండపి మండలం నెన్నూరుపాడులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు శుభపరిణామమన్నారు. ఈ పార్కును మంగళవారం వర్చువల్‌గా కనిగిరి పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభిస్తుండటం ఆనందదాయకమన్నారు. నెన్నూరుపాడులో రూ.7కోట్ల పెట్టుబడితో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభించడం ద్వారా నియోజకవర్గంలోని వందలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలి

నెన్నూరుపాడు గ్రామం వద్ద 44 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తున్న నేపథ్యంలో కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం కోసం అక్కడ ఏర్పాట్లు చేసినట్లు ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులు

ఎంఎస్ఎంఈ పార్కు స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

కొండపి, : మండలంలోని నెన్నూరుపాడు గ్రామంలో ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) పార్కుకు కేటాయించిన 44 ఎకరాల భూమిని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న సోమవారం పరిశీలించారు. మంగళవారం సీఎం చంద్రబాబు పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో నెన్నూరుపాడు వద్ద కేటాయించిన స్థలం వద్ద సీఎం చంద్రబాబు కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. అందుకు సంబంధించి అక్కడ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులు, వెలుగు ఏపీఎం గోపీనాథ్, పీఆర్ ఏఈఈ బి.ప్రసాదరావు, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, తెలుగు రైతు నియోజకవర్గ నాయకుడు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదాయవనరులు పెంచుకోవాలి


ఎంఎల్ఏ జనార్దనరావు

ఒంగోలు(రూరల్),నవంబరు10(ఆంధ్రజ్యోతి): ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ వనరులు పెంచుకోవాలని ఎంఎల్ఏ దామచర్ల జనార్దనరావు అన్నారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయంలో సోమవారం ఏఎంసీ మార్కెట్ కమిటీ తొలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఏ మాట్లాడుతూ పెళ్లూరు, త్రోవగుంట దగ్గర గల వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టులద్వారా ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన నగదు ఇప్పించాలని ఎంఎల్ఏను కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ జాతీయరహదారి వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడంతో ఆదాయవనరులు పెంచుకోవచ్చునని కమిటీ సభ్యులు సూచించారు. అనంతరం యార్డు ప్రాంగణంలో ఎంఎల్ఏ జనార్దనరావు మొక్కలు నాటారు. ఒడా ఛైర్మన్ రియాజ్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ చిట్టెం వెంకటదుర్గాప్రసాదరావు, కార్యదర్శి నరహరి సభ్యులు పాల్గొన్నారు.


ఏఎంసీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ దామచర్ల జనార్దనరావు

జిల్లాస్థాయి పోటీలకు పాతసింగరాయకొండ విద్యార్థుల ఎంపిక

సింగరాయకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలకు మండలంలోని పాత సింగరాయకొండ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం ఒంగోలు వీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్-17 బాలుర, బాలికల పరుగు పందెంలో వీరు సత్తా చాటారు. బాలికల విభాగం 400, 1500 మీటర్లలో రోహిణిశ్రీలక్ష్మి ద్వితీయ స్థానం, 3000 మీటర్లలో సీహెచ్.వైష్ణవి ద్వితీయ స్థానం సాధించారు. బాలుర విభాగం 1500 మీటర్లలో ఎం.చరణ్‌తేజ ద్వితీయ స్థానం, 3000 మీటర్ల పందెంలో పి.హర్షవర్ధన్ ప్రథమ, ఎం.చరణ్‌తేజ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, అన్వర్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సూర్యనారాయణ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నటరాజ కళాకేంద్రం కమిటీ ఎన్నిక

మద్దిపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు నటరాజ కళాకేంద్రం నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఉప్పుగుండూరి నాగేశ్వర రావు, అధ్యక్షునిగా ఆరె సూర్యనారాయణ, ఉపాధ్యక్షునిగా కాకుమాను సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా దేవరశెట్టి ఎలమందతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆరె సూర్యనారాయణ మాట్లాడుతూ నటరాజ కళాకేంద్రంకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

పొగాకు రైతులకు మెరుగైన ధర

పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పించి సకాలంలో అమ్మకాలు పూర్తి చేయడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామని పొగాకు బోర్డు ఆర్‌ఎం రామారావు తెలిపారు. సోమవారం వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించి పొగాకు కొనుగోలు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధరల విషయంలో ఎప్పటికప్పుడు వ్యాపారులతో సంప్రదింపులు చేస్తున్నామని, కొనుగోలు మరో 10 రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

మద్దిపాడు పైపాలెం ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎర్రగర్ల చైతన్య స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి భజన అంగరంగ వైభవంగా నిర్వహించారు. అరటి బోదెలతో అయ్యప్ప మందిరాన్ని, 18 మెట్లను తీర్చిదిద్దగా భజన కార్యక్రమంలో అయ్యప్ప, శివ, భవానీ స్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక్, రాజేశ్వరి నేతృత్వంలో అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.


గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

గ్రానైట్ పరిశ్రమ సమస్యలపై కమిటీ పరిశీలన

- ఓనర్లు అడిగిన డిమాండ్లపై నిజనిర్ధారణలో మైన్స్ అధికారులు

చీమకుర్తి,నవంబరు10(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమ సమస్యలపై పరిష్కార దిశగా ప్రభుత్వం నియమించిన కమిటీ వేగంగా చర్యలు తీసుకుంటోంది. సమస్యల అధ్యయనానికి ఫ్యాక్టరీ ఓనర్లు విన్నవించుకున్న డిమాండ్లను ఫీల్డ్ లెవెల్లో పరిశీలించటానికి మైన్స్ అధికారులు సోమవారం చీమకుర్తి మండల పరిధిలోని పలు గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. యజమానులు అడిగిన ప్రధాన డిమాండ్లలో ఒకటైన కట్టర్‌కి క్యూబిక్ మీటర్‌కి ఇచ్చే అనుమతి 350 అడుగుల నుంచి 450కి పెంచమనే అంశంపై అధికారులు పరిశీలించారు. టెక్నాలజీ పెరిగిన నేపథ్యంలో కటింగ్ బ్లేడ్ మందంలో వచ్చిన మార్పుల మేరకు ముడిరాయినుంచి ఎక్కువ శ్లాబులు ఉత్పత్తి అవుతున్నాయని,ఈ మేరకు పరిమితి పెంచాలని మంత్రుల కమిటీ ముందు ఓనర్లు తెలిపారు. ఈ అంశం నిజమా కాదా అని ప్రత్యక్షంగా మైనింగ్ అధికారులు పరిశీలించారు.ట్రాన్సిట్ పాస్‌లను రద్దు చేయాలని మరో విన్నపాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. పెరల్,కృష్ణశాయి,కేఎంబీ,ఆపిల్ గ్రానైట్ ఫ్యాక్టరీలను పరిశీలించారు.పరిశీలించిన వారిలో మైన్స్ ఏజీ రవివర్మ, టీఏలు సురేష్‌బాబు, రాజా,హరిబాబు, నాగేశ్వరరావులున్నారు.వీరి వెంట ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు యర్రగుంట్ల శ్రీనివాసరావు,కాట్రగడ్డ రమణయ్య,భవాని ప్రసాద్,అహ్మద్‌భాష పాల్గొన్నారు.


సత్యను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సంగమేశ్వరుని సన్నిధిలో కార్తీక వనభోజనాలు

- హాజరైన దామచర్ల సత్య, కూటమి పార్టీల నేతలు

పొన్నలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపాడు సమీపంలోని సంగమేశ్వర దేవాలయంలో సోమవారం కార్తీక వనభోజనాలను నిర్వహించారు. రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ పాల్గొని సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ సంగమేశ్వర ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజా ప్రభుత్వం సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, టీడీపీ పొన్నలూరు, జరుగుమల్లి, మర్రిపూడి, కొండపి, సింగరాయకొండ మండలాల అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, పోకూరి రవికుమార్, గోపిరెడ్డి శ్రీనివాసులు, కొర్రపాటి వసంతనాయుడు, మించాల బ్రహ్మయ్య, సీనియర్ నాయకుడు కర్ణ కోటిరెడ్డి, నాయకులు మండవ ప్రసాద్, పల్లపోతు ప్రసాద్, పెద్దబాబు, గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, ముప్పాళ్ల పీఏసీఎస్ ఛైర్మన్ మన్నెం రమణయ్య, సర్పంచ్ షేక్ మస్తాన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా శివారెడ్డి


పీవీ శివారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా భారతీయజనతాపార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పిడుగు వెంకట శివారెడ్డిని నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు సంస్థలకు ప్రభుత్వం డైరెక్టర్ పదవులు కేటాయించగా అందులో ఒంగోలుకు చెందిన పీవీ శివారెడ్డికి లేబర్ వెల్ఫేర్‌బోర్డులో డైరెక్టర్‌గా అవకాశం దక్కింది. భారతీయ జనతా పార్టీలో కీలకంగా పనిచేసిన శివారెడ్డి గత ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. ఆ సమయంలో కూటమి అభ్యర్థుల గెలుపుకోసం పని చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూటమి పార్టీలకు చెందిన ప్రతినిధులకు నామినేటెడ్ పదవులు ఇస్తున్నారు. అందులో భాగంగానే శివారెడ్డికి సోమవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా అవకాశం లభించింది. పలువురు బీజేపీ నాయకులు అభినందించారు.

వాటర్‌షెడ్.. పర్యావరణానికి పునాది

(3వ పేజీ తరువాయి)

అమలు చేసుకుంటాయనే దానిపై అభిప్రాయాలు సేకరించారు. రాజస్థాన్‌లో అభివృద్ధి చేసిన సరోవరం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఝాన్సీలో వాటర్‌షెడ్ కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన నీటి వనరులను ప్రతీఒక్కరూ సందర్శించి స్ఫూర్తి పొందాలని అధికారులు సూచించారు. ల్యాండ్ స్కేపింగ్, వనరుల పరిరక్షణ ద్వారా పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ గురించి ఇక్రిశాట్ సంస్థ పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందర్నీ ఆకట్టుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాకు చెందిన ఇక్రిశాట్ థీమ్ లీడర్ డాక్టర్ రమేష్ సింగ్ దీని గురించి వివరించారు. సాంప్రదాయ నీటి పొదుపు విధానాల గురించి న్యూఢిల్లీకి చెందిన అంతర్జాతీయ నీటి యాజమాన్య సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ గోపాల్‌కుమార్ విశ్లేషించారు. నదులు, సాంప్రదాయ నీటి సంరక్షణ విధానాల పునరుద్ధరణ, పర్వతశ్రేణుల్లో నీటి బుగ్గల పునరుద్ధరణ, గడ్డి మైదానాల అభివృద్ధి, వాటర్‌షెడ్ ప్రాజెక్టుల అమలులో హైడ్రాలజీ ప్లానింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీవోఎల్ఆర్ సెక్రెటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ నితిన్ ఖడే, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరి శశిభూషణ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణ తేజ, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా నమూనా

సదస్సులో భాగంగా ఐటీసీ హోటల్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ వాటర్‌షెడ్ 3డీ నమూనా ఏర్పాటు చేసింది. పచ్చని సోయగాల నడుమ, సరోవరం నుంచి నీరు జాలువారుతున్నట్లు రూపొందించిన ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది. చూడముచ్చటైన ల్యాండ్ స్కేపింగ్, ప్రజలకు నడక మార్గాలు వంటివి ఇందులో పొందుపరిచారు.

విద్యార్థులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా ముచ్చట్లు

అన్నంబొట్లవారిపాలెం (పర్చూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఓ వేడుకలకు సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏదుబాడు గ్రామం నుంచి అన్నంబొట్లవారిపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు ఎమ్మెల్యేని చూసి పరుగులు తీస్తూ ఆయన వద్దకు చేరుకున్నారు. 'గుడ్ మార్నింగ్ సార్' అంటూ పిల్లలు సెల్యూట్ చేశారు. ఎమ్మెల్యే ఏలూరి 'వెరీ గుడ్ మార్నింగ్' అంటూ ఒక్కరిని స్కూల్, ఊరు, తరగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అయనతో ఆప్యాయంగా మాట్లాడారు. విద్యార్థులను మీకు ఏసబ్జెక్టు అంటే ఇష్టం, అభిరుచులు ఏంటి అంటూ వారితో కొంత సేపు ముచ్చటించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అవీ..ఇవీ..

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత

బల్లికురవ, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో దెబ్బతిన్న పంటలకు వెంటనే పంట నష్ట పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం తహసీల్దార్ రవినాయక్‌ను వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాలలో వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అధికారులు 33శాతం పైన పంట దెబ్బతింటేనే పరిహారం జాబితాలో నమోదు చేస్తామని చెబుతున్నారన్నారు. అలాకాకుండా పంట ఎంత దెబ్బతిన్న నమోదు చేయాలన్నారు. అధికారులు పంటలను పూర్తిగా పరిశీలించకుండానే పంట జాబితాలను నమోదు చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలలో పర్యవేక్షణ చేయకుండానే పంట నష్ట జాబితాలను తయారు చేసి పంపుతున్నారన్నారు. వెంటనే అధికారులు గ్రామాలలో పర్యటించి కౌలుకార్డులు లేని కౌలురైతులకు కూడా పంటనష్ట పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు జి. అంజయ్య, బొంతావీరయ్య తదితరులు ఉన్నారు.

నేడు టెక్స్‌టైల్ పార్కుకు భూమిపూజ

● స్థలంలో ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

వేటపాలెం (చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని చేనేతల చిరకాల స్వప్నం నేడు సాకారంకానుంది. సుదర్ఘీ కాలంగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు నేతన్నలు ఎదురు చూపులు ఫలించాయి. ఎమ్మెల్యే కొండయ్య చల్లారెడ్డి పాలెంలో మంగళవారం భూమిపూజ కార్యక్రమం చేయను న్నారు. ఈక్రమంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లును తహసీల్దార్ గీతా రాణీ, ఎంపీడీవో రాజేష్‌బాబు సెక్రటరీ సంపత్‌కుమార్ ఇతర సిబ్బందితో కలిసి పరిశీలించారు. దీంతో నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



భూమిపూజ కార్యక్రమంలో అధికారులు, స్థానికులు

వేటపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నట్లు వేటపాలెం మండలం నీలకంఠాపురం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు స్వప్న చెప్పారు. సోమవారం సర్వశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ద్వారా పాఠశాలలో రూ.13.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన తరగతి గదికి స్కూల్ కమిటీ, స్థానిక పెద్దలుతో కలిసి భూమిపూజ చేశారు. సుదీర్ఘ కాలంగా ఇబ్బందులకు నేటితో పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో శివయ్య, కొండలరెడ్డి, వెంకట సుబ్బారావు, బుల్లియ్య, వరప్రసాదరావు, హనుమంతురావు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

● మృతుడు పర్చూరు మండలం గర్నెపూడి వాసి



పోతురాజు (ఫైల్)

బోయినవారిపాలెం (చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే విధులు నిర్వహిస్తూ వీఆర్‌వో గుండెపోటుతో మృతిచెందాడు. పర్చూరు మండలం గర్నెపూడికి చెందిన అల్లడి పోతురాజు(49) ప్రస్తుతం చీరాల మండలం బోయినవారిపాలెం సచివాలయంలో వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే సోమవారం గ్రామం పరిధిలో సహ ఉద్యోగులతో కలిసి రీసర్వే నిర్వహిస్తూ అకస్మాత్తుగా కుప్పకూలాడు. దీంతో ఆందోళన చెందిన ఉద్యోగులు వెంటనే ముందుగా ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు చీరాల ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తహసీల్దార్ గోపీకృష్ణ, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లల ఉన్నారు.

సోలార్ హబ్‌కు పచ్చజెండా

ఎస్.ఎల్.గుడిపాడు వద్ద ఏర్పాటుకు ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రి మండలి



సోలార్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతం

అద్దంకి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో సోలార్ యూనిట్‌ల పరికరాల తయారీ హబ్‌కు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. నియోజక వర్గంలోని బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, సంతమాగులూరు మండలం తూర్పు కుందుర్రు రెవెన్యూల పరిధిలో వెయ్యిఎకరాలలో రెన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫాక్చరింగ్‌జోన్ ఏర్పాటు చేసేందుకు ఏపీఎస్‌పీసీఎల్ ముందుకు వచ్చింది. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున సోలార్ ప్లాంట్‌లు, యూనిట్‌లు ఏర్పాటు జరుగుతున్నాయి. కేం ద్ర ప్రభుత్వం కూడా రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో సోలార్ ప్లాంట్ల, యూనిట్లలో వినియోగించే వస్తువులు తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడంతో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మరింత చొరవ తీసుకొని నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అందుకు అవసరమైన వెయ్యి ఎకరాల భూములు బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో గుర్తించారు. రైతులకు పరిహారంగా ఎకరాకు రూ.18 లక్షల చొప్పున చెల్లించే విధంగా కూడా అధికారులు పలు ధఫాలుగా రైతులతో చర్చించారు. అదే సమయంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే వీలు ఉండడంతో రైతులు కూడా తమ భూములు ఇచ్చేందుకు సుముఖత చూపారు. ఇప్పటికే బల్లికురవ, సంతమాగులూరు మండలాలలో గ్రానైట్ పరిశ్రమతో ప్రత్యేక గుర్తింపు రాగా, రెన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుతో మరింత గుర్తింపు రానుంది.

వంతెన ఏర్పాటు చేయండి మహాప్రభో

కొమ్మినేనివారిపాలెం- కొప్పెరపాడు గ్రామాల రైతుల వినతి



వంతెన లేకపోవడంతో రహదారి మధ్య నిలిచిన నీరు

బల్లికురవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం- కొప్పెరపాడు గ్రామాల మధ్య ఉన్న లింక్ రోడ్డులో వంతెన లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డును ఇటీవల జిల్లా పరిషత్ నిధులతో గ్రావెల్ మట్టితోలి అభివృద్ధి పరిచారు. కాని వాగుపై వంతెన ఏర్పాటు కాలేదు. దీంతో నిత్యం రెండు గ్రామాలకు చెందిన రైతులు పంట పొలాలకు గ్రామాలకు రావాలంటే మూడు అడుగుల లోతు నీటిలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనాలపై ఎరువుల బస్తాలు వేసుకొని నీటిలో రాలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. సాగర్ కాలువల ద్వారా నీరు వచ్చే అన్ని రోజులు వాగు నీరు బాగా ఉధృతిగా వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. పలుమార్లు రోడ్డును అభివృద్ధి చేశారు గాని వంతెన మాత్రం నిర్మాణం చేయలేదని రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డులో వంతెన ఏర్పాటు చేస్తే నామ్ హైవే రోడ్డుకు సులువుగాగా వెళ్లేలా ఉపయోగ పడుతుందని పేర్కొంటున్నారు. మండల పరిషత్ నిధుల ద్వారా అయినా, లింకురోడ్డులో వంతెన ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతు న్నారు. గతంలో వంతెన లేక వాగులో ప్రమాదాలు కూడా జరిగిన దాఖలాలు ఉన్నా యని ప్రజలు గుర్తు చేస్తున్నారు. అధికారులు వెంటనే వంతెన ఏర్పాటు పనులు చేయించే చర్యలు చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరతున్నారు.

నేడు జిల్లాలో పంట నష్టాలపై కేంద్రబృందం పరిశీలన

బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసిన కలెక్టర్



బృందం సభ్యులు పౌసుమీ బసుకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టాలు, దెబ్బతిన్న కాలువలను పరిశీలించేందుకు నేడు జిల్లాలో కేంద్రబృందం సభ్యులు, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమీ బసు పర్యటించనున్నారు. ఈక్రమంలో సోమవారం చీరాల ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు విచ్చేశారు. వీరిని కలెక్టర్ డా.వినోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. వారి వెంట ఆర్థిక మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరక్టర్ మహేష్‌కుమార్, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, హైవే ఇంజనీర్ శశాంక్ శేఖర్‌రాయ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నిపుణులు సాయి భగీరథ్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజింగ్ డైరక్టర్ అథారటీ ప్రకర్ జైన్ ఉన్నారు.

చేనేత రంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

నేత కార్మికులతో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య

చీరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'చేనేత రంగాభివృద్ధికి అన్నివిధాలుగా ప్రత్యేక కృషి చేస్తున్నాము. మునుపెన్నడూ లేని విధంగా కొత్త శకానికి కూటమి ప్రభుత్వంతో నాంది పలికింది' అని ఎమెల్యే ఎంఎం. కొండయ్య తెలిపారు. చేనేతల కలలను సాకారం చేస్తూ మంగళవారం వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెంలో హ్యాండ్‌లూమ్ పార్కు ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో చేనేత నాయకులు, కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంగళవారం జరుగనున్న భూమిపూజకు సంబంధించి నేతన్నలతో మాట్లాడారు. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ట్లు వివరించారు. విశేషంగా కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ మించాల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు, సీనియర్ టీడీపీ నాయకులు సిద్ధి బుచ్చేశ్వర రావు, నాసిక వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలలో పరిశీలన



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న శివకుమార్

ఇంకొల్లు, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని పదవతరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్ కె.శివకుమార్ పరిశీలించారు. 2025-26వ సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు మండలంలోని ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంకొల్లు బాలికోన్నత పాఠశాల, శ్రీగౌతమి హైస్కూల్, ఆదర్శ హైస్కూల్, పూసపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శివకుమార్, ఎంఈవో శ్రీనివాసరావులు పరిశీలించారు. అన్ని కేంద్రాలలో వసతులను పరిశీలించారు. ప్రతి సబ్జెక్ట్ టీచర్లతో మాట్లాడి పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, నవంబరు10(ఆంధ్రజ్యోతి): నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా బల్లికురవ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఇన్‌చార్జ్ ఏఈ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, మండల ప్రజలు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,నవంబరు10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌టవర్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో మంగళవారం అద్దంకి పట్టణంలోని రవి రెస్టారెంట్ నుండి భవానిసెంటర్ వరకు నామ్ రోడ్డుకు రెండు వైపుల, భాగ్యనగర్ పరిసర ప్రాంతాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయం త్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

మందుబాబుకు జరిమానా

అద్దంకి,నవంబరు10(ఆంధ్రజ్యోతి):మద్యంసేవించి వాహనం నడిపిన వ్యక్తిని సోమవారం అద్దంకి కోర్టులో హాజరు పరచగా, న్యాయాధికారి అఖిల రూ.3వేల జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

మొంథా తుఫాన్ పంటనష్టంపై నివేదిక

● 1985 ఎకరాలలో పంటనష్టం

పంగులూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీవర్షాలు, గాలులకు మండలంలోని పలు గ్రామాలలో 1985 ఎకరాలలో పంటనష్టం వాటిల్లినట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల ఎన్యుమరేషన్ పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిపారు. మండలంలో 1843 ఎకరాలలో మినుము పంటకు నష్టం వాటిల్లగా, 74.78 ఎకరాలలో పత్తి, 68 ఎకరాలలో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదికలో తెలిపారు. పంట నష్టపోయిన రైతులు 1112 మంది కాగా, నష్టం అంచనా విలువ రూ.123 కోట్లుగా గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు ఏవో తెలిపారు.

జూదరులను పట్టించిన డ్రోన్

● పేకాట శిబిరంపై దాడి..రూ.1.70 లక్షలు స్వాధీనం

● 14 మంది అరెస్ట్..14 సెల్‌ఫోన్‌లు స్వాధీనం



పేకాట ఆడుతున్న జూదరులు

నక్కలవారిపాలెం(చీరాల), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నేర నియంత్రణకు కృషి చేస్తున్నారు. ఈక్రమంలోనే రూరల్ సీఐ శేషగిరిరావు ఆదేశాల మేరకు ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ స్టేషన్ పరిధిలోని నక్కలవారిపాలెంలో పేకాట శిబిరాన్ని డ్రోన్ సాయంతో గుర్తించారు. శిబిరంపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 14 మంది జూదరులను అరెస్ట్ చేశారు. అలాగే వారి సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో రూ.1.70 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు

● జిల్లా వ్యాప్తంగా పోలీసుల అలర్ట్

● అన్ని ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు



చీరాల పట్టణంలో పోలీసుల తనిఖీలు

చీరాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో బాంబు పేలుళ్ల చోటుచేసుకోవడంతో పలువురు అమాయకులు మృత్యువాత పడ్డారు. దీంతో సోమవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. బాపట్ల, చీరాల, రేపల్లె, వేమూరు, అద్దంకి, పర్చూరు ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లలో తనిఖీలు చేపట్టారు. కార్లు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు సైతం ముమ్మర తనిఖీలు చేశారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అనుమానితుల వివరాలు సేకరించారు. ఎస్పీ ఉమామహేశ్వర్ బాపట్ల రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. పరిస్థితుల గురించి అధికారులను ఆరా తీశారు. అలాగే తీరం వెంబడి ప్రాంతాల్లో మెరైన్ పోలీసులను అధికారులు అప్రమత్తం చేశారు. కట్టుదిట్టమైన గస్తీ ఉంచారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా కార్యాలయాలనికి అందించాలని సూచించినట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి ఖోఖో విజేత పంగులూరు



ట్రోఫీని అందుకుంటున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలురజట్టు

పంగులూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్, ఖోఖో పోటీలలో ప్రకాశం జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 8, 9, 10 తేదీలలో అండర్-19 రాష్ట్రస్థాయి బాలుర ఖోఖో పోటీలు విజయనగరం కేంద్రంగా నిర్వహించారు. ఈ పోటీలలో సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో విజయనగరం జట్టుతో తలపడిన ఉమ్మడి ప్రకాశంజిల్లా బాలుర జట్టు గెలుపొందినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యం.సీతారామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జిల్లా జట్టుకు గుర్తింపు తెచ్చారన్నారు. విజేతలకు ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అక్టోబర్ 10న ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర ఖోఖో జట్టు ఎంపిక నిర్వహించారు. ఎస్‌జి.ఎఫ్. అండర్-19 బాలురఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లాజట్టు ఈనెల 6వ తేదీ వరకు పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం. కళాశాలలో శిక్షణ పొందారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

నూతలపాడు(పర్చూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్ల గాలిగోపుర కలశ స్థాపన ధ్వజస్తంభ పునర్నిర్మాణ వేడుకలు సోమవారం అశేష భక్తుల నడుమ నిర్వహించారు. స్వామివార్ల ధ్వజస్తంభ వేడుకలను తిలకించేందుకు పెద్దఎత్తున ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. స్వామివార్ల పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

అద్దంకి : కార్తీక సోమవారం పూజలు మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పాతశివాలయం, వేయిస్తంభాలగుడి, కమతేశ్వరాలయాలలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించి, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. వేకువఝామునుంచే భక్తులు మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



ఉసిరిచెట్టు వద్ద దీపాలు వెళిఇస్తున్న మహిళలు

హర హర మహాదేవ

చినగంజాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో తెల్లవారుజామునే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శోభాయమానంగా స్వామిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఆలయాల ప్రాంగణంలో, ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మండల పరిధిలోని సోపిరాలలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం, కడవకుదురులోని గోకర్ణశ్వర స్వామి ఆలయం, చినగంజాం గంగాపార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వర స్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లె, పెదగంజాం తదితర గ్రామాల్లోని శైవ క్షేత్రాలాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రాభి షేకాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు